# సమర్థ సద్గురు

ఆగష్టు 2024

ఆధ్యాత్మిక మాసపత్రిక

వెల : రూ. 10.00



26.05.2024 నుండి 10.06.2024 వరకు
శ్రీ మాతాజీవారి యునైటెడ్ కింగ్‌డమ్ పర్యటన దృశ్యములు.







# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక

శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా
ఫోన్ (0863) 2293645, 2293206.
web : www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com

**సంపాదక వర్గము**
మిస్. పి. ఇందిరాదేవి
డా॥ యమ్. స్వర్ణముఖి
సి.వి. రమణ బాబు
పి.యస్.ఆర్.కె. ప్రసాద్
కె. మురళీ మోహన వర్మ

సంపుటి 43 సంచిక 12
పేజీలు 44
ఆగస్ట్ 2024

5సం॥ల చందా రూ. 500
2సం॥ల చందా రూ. 240
సంవత్సర చందా రూ. 120
విడిప్రతి వెల...... రూ. 10

బ్యాంక్ డ్రాఫ్ట్ Y.S.C.K.P.M చారిటబుల్ ట్రస్ట్, A/C సమర్థ సద్గురు ,పేరుతో డ్రా చేయండి.
M.O, బ్యాంక్ డ్రాఫ్ట్ పంపవలసిన చిరునామా
మేనేజరు
సమర్థ సద్గురు మాగజైన్
శ్రీకాళీగార్డెన్స్ - 522508, నంబూరు
గుంటూరు జిల్లా

Printed and published by C.V. Ramana Babu on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh and Published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, Editor PALURI SIVA RAMA KALI PRASAD

**ఈ సంచికలో** ............................ ....... **పేజీ**

దాశరథీ శతకము ............................ ..........4
శ్రీబాబూజీ ఉవాచ........................................ 5
అమ్మమాట.................................. ............ 7
శ్రీ కాళీ తత్త్వము .................. ......................10
నిరీక్షణా మాధుర్యము ..............................12
మరి మరి నిన్నే మొరలిడ .........................14
ధ్యానం .............. ............. .......... .......... ......... 16
జపాన్ దేశ మతాలపై
నా అవగాహన .........................18
మనసు పరవశించెనే .............................20
నామ మహిమ .... .......... ....... ....... ..... ........21
శ్రీ దాసశేష స్వామి....... ..............................25
నారద భక్తి సూత్రములు ............... ..............27
ఆశ ............................ ...................................29
శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమ కార్యక్రమాలు ......30
మనశ్శతకము ..............................................31
నిరీక్షణ ........................................................32
శ్రీ శంకర జయంతి......... .........................34
శ్రీ రాధాకృష్ణా గతిర్మమ................. .........36
సమర్థ సద్గురునాథుని దివ్యచరిత్ర.....38
విష్ణు కథలు ...... ............................ ...................40

## దాశరథీ శతకము - భద్రాచల రామదాసు

49) **చేసితి ఘోరకృత్యముల్ చేసితి భాగవతాపచారముల్**
**చేసితి నన్యదైవములఁజేరి భజించిన వారిపొందు నేఁ**
**జేసిన నేరముల్ దలఁచి చిక్కులఁబెట్టకుమయ్య నీ**
**దాసుఁడనయ్య భద్రగిరి దాశరథీ కరుణాపయోనిధీ!**

భావం - నే చేసిన నేరము లెంచక ఓ రామా! ఎన్నో ఘోరములు చేసితిని. భగవంతుని యందు తప్పులు చేసితిని. అన్యదేవతలను కొలిచి వారి యొక్క స్నేహములు చేసితిని. అయినను నీ దాసుడనైన నన్ను కాపాడుము.



*అనన్యత అంటే ఏమిటి?
*క్రూరులై తనను హింసించిన దొంగలను కూడా తమ ప్రేమతో మార్చివేసిన మహాత్ములు ఎవరు?
*దేవుడూ, దెయ్యమూ లేవని వాదించిన వ్యక్తికి దెయ్యం ఎలా జ్ఞానోదయం కావించి దేవుని వద్దకు చేర్చింది?
*చనిపోయిన పద్మావతీదేవి తిరిగి ఎలా బ్రతికింది?
*దశరధునికి దక్కని భాగ్యం ఎవరికి దక్కింది?
*పాముకాటుకు చనిపోయిన వ్యక్తి మళ్ళీ ఎలా బ్రతికాడు?
*శిష్యుడు ఎన్నిసార్లు ఇంటికి పిలిచినా గురువుగారు ఎందుకు రాలేదు?
*గురువు చెప్పిన యోగాసనం వేస్తే శిష్యుని శరీరం అష్టవంకర్లుగా ఎందుకు మారిపోయింది?
*బలి చక్రవర్తి మూడడుగుల ద్వారా ఏమి హరింపజేసుకున్నాడు?

***సమాధానాలు లోపలి పేజీలలో............................***

## శ్రీ బాబూజీ ఉవాచ - కీ.శే. పరాశర ప్రసాద్

12-1-1981

ఈరోజు ఉదయం శ్రీ బాబూజీ భక్తులకు దర్శనం ఇచ్చారు. శ్రీ బాబూజీ మాట్లాడుతూ "రేపు భోగి పండుగ కదూ. మీరంతా ఉదయమే తలంట్లు పోసుకుని రండి. ఈ బుజ్జిబాబు వస్తాడు. భోగిపళ్ళు పోసుకుందురుగాని. పరమాత్ముడు కరుణాపయోనిధి. అందరికీ భోగభాగ్యాలను అందజేస్తాడు. భోగిపండుగ అంటే ఏమిటో తెలుసా?" అని ప్రశ్నించారు.



వారు ఇంకా మాట్లాడుతూ "భోగిపండుగ రోజున బలిచక్రవర్తిని వామనుడు పాతాళమునకు త్రొక్కిన సందర్భంగా దేవతలు భోగిమంటలు వేసుకున్నారు. భోగిమంటలు వేసుకుంటే మనలోని కలుషములు, సంకటములు దగ్ధము అవుతాయి" అన్నారు

బలిచక్రవర్తిని వామనుడు మూడు అడుగులు ఇమ్మని కోరాడు. ఆ మూడు అడుగులు ఇచ్చి బలి తనలోని స్థూల, సూక్ష్మ, కారణ శరీరాలని, జాగ్రత్, స్వప్న, సుషుప్తి అవస్థలను సత్త్వ, రజో, తమో గుణాలను, ఈషణత్రయాన్ని హరింపజేసుకున్నాడు. వామనుడు ఒక పాదము భూమిపై ఉంచాడు. అదే స్థూలము. రెండవ పాదము ఆకాశముపై ఉంచాడు. అది సూక్ష్మము. మూడవపాదాన్ని ఎక్కడ ఉంచమనటానికీ ఇష్టములేక బుద్ధిఉన్న శిరస్సుపై ఉంచు ప్రభూ! అంటాడు బలిచక్రవర్తి.

ఆ పాదము శిరస్సుపై ఉంచగానే బుద్ధి సమాధి అని సమాధి స్థితిని పొందాడు. దాని ద్వారా ఆత్మజ్యోతిని దర్శించాడు. ఆనందాన్ని పొందాడు. ఆ దివ్యచరణారవిందముల స్పర్శ సమస్త సంకటములను సత్త్వరజోతమో గుణాలను అరిషడ్వర్గాలను కామ క్రోధాది గుణాలను నశింపజేసి

సత్యశివసుందర స్వరూపుడిగా ప్రకాశింపజేస్తుంది. ఆ పాద స్పర్శ ద్వారా అజ్ఞానము అనే చీకటి తొలగిపోయి జ్ఞానము అనే వెలుగును దర్శించాడు. అట్టి స్థితిని మీరు కూడ పొందుదురుగాక!" అని ఆశీర్వదించారు.

అంతవరకు కూర్చీలో కూర్చున్న శ్రీబాబూజీ క్రిందికి దిగివచ్చి అందరిమధ్య కూర్చున్నారు. "నేను ఎక్కడ కూర్చున్నా ఫర్వలేదాయ్యా. మీరంతా లేచి నుంచోనవసరం లేదయ్యా. మీ మనస్సు లేస్తే చాలు. అంతా కలిసి కూర్చుందాం. అందరిలో ఉన్న ఆత్మవస్తువు ఒక్కటే. అది తెలుసుకోండి చాలు" అన్నారు శ్రీబాబూజీ.

ఇంతలో ఇండియన్ ఎక్స్‌ప్రెస్ ఎడిటర్ సంపత్‌గారు, ఆంధ్రప్రభ ఎడిటర్ సుబ్రహ్మణ్యంగారు వచ్చారు. సంపత్‌గారి అమ్మాయి ఎంతో హుషారుగా నవ్వింది.

శ్రీబాబూజీ ఆ పిల్లని చూసి "మన మనస్సు ఆ స్థితికి వెళ్ళాలి. శరీరంతో పనిలేదు. అది ఎలా ఉన్నా సరే. ఆ మనస్సులో ఏ భావాలూ వుండవు. అప్పుడు ఎంతో ఆనందంగా ఉంటుంది. పిల్లల హృదయాలు అందుచేతనే ఎప్పుడూ ఆనందంగా ఉంటాయి. నీచభావాలు, ద్వేషము, ఈర్ష్య, అసూయ ఉంటాయా? ఆధ్యాత్మిక చింతన చూశారా ఎంత ఆనందాన్నిస్తుందో? ఇంత ఆనందం ఇంక ఏదైనా ఇవ్వగలుగుతుందా? అందుచేతనే సజ్జన సాంగత్యము అవసరము.

ఇలా మీరంతా ఆనందంగా ఉంటే ఇంక కావలసినదేముంది? సమస్త జీవరాశులను ప్రకాశింపజేసే ఆత్మవస్తువు ఒకటే కదా! మరి మీలో మీకు ఎందుకండీ భేదాభిప్రాయాలు? అనేక పూసలు కలిస్తే హారం తయారవుతుంది. అయితే ఆ పూసలన్నింటిని కలిపి హారంగా తయారు చేయాలంటే దారం కావాలి. ఇప్పుడు మీరే చెప్పండి ఆ పూసలు గొప్పవా? లేక వాటిని కలిపిన దారం గొప్పదా? అదే భగవానుని చిద్విలాసము. అది విచిత్రముగా ఉంటుంది. దానిని ఎవ్వరూ ఊహించలేరు" అన్నారు శ్రీబాబు.

# అమ్మ మాట

- జపమాలా ప్రసాద

*చిలకలపూడి బంగారం*

'నేను - నాది' అనే మమకారములో పడి విర్రవీగుతున్న మానవులకి, యెటువంటి చేదు అనుభవాలు ఎదురవుతాయన్న విషయం గురించి చెబుతూ శ్రీ మాతాజీ చేసిన దివ్యబోధ:



"పూర్వం ఒక గురువుగారి వద్ద ఒక గృహస్థ శిష్యుడుండేవాడు. అతడికి తన భార్యయందు అత్యంత అనురాగము. అతడు తన గురువుగారితో ఒకనాడు యిలా అంటాడు 'గురుదేవా! మీరు ఎంతో చక్కగా తత్వాన్ని గురించి చెపుతూ, వైరాగ్యాన్ని కలిగివున్నవారికి శాశ్వతానందాలు ప్రాప్తిస్తాయని సెలవిచ్చారు. నాకు నా భార్య అనిన మిక్కిలి ప్రేమ. ఆమె కూడా నన్నెంతో ప్రేమిస్తోంది. మేమిరువురము ఒకరిని విడిచి ఒకరుండలేము. ఆమె వద్ద నుండి నేను పొందుతున్న ఆనందము శాశ్వతమైనది, సత్యమైనది అని నాకనిపిస్తున్నది. మీరేమో యీ లౌకిక బంధాలన్నీ అశాశ్వతమైనవని చెబుతున్నారు. మరి నాకేల వైరాగ్యం కలగటం లేదు? దయచేసి నేను తరించే మార్గాన్ని సెలవీయండి' అని అంటాడు.

అది విన్న గురుదేవుడు, తన మనసులో నవ్వుకుని, కళంక పూరితమైన లౌకిక ప్రేమల యొక్క నశ్వరత్వాన్ని తన శిష్యుడికి అనుభవ పూర్వకంగా ఋజువుచేయ సంకల్పించి, 'నాయనా! అదంతా సరేగాని, యివాళ నీకొక క్రొత్త యోగాసనం నేర్పిద్దామనుకుంటున్నాను, దానిని గానీ నువ్వు బాగా సాధన చేస్తే, నీకు చాలా మంచి జరుగుతుంది' అని అంటారు.

ఆ శిష్యుడు సరేనని, ఆ యోగాసనాన్ని నేర్చుకుని, క్రమంగా తత్ సాధనలో లీనమైపోతాడు. అప్పుడతడి శరీరం ఎనిమిది వంకరలుగా తిరిగిపోయి, అతడు సమాధిస్థితిలోకి వెళ్ళిపోతాడు. తన భర్త అలా అచేతనంగా అయిపోవడం చూచి, అతడు మరణించాడని భావించి,

అతడి భార్య రోదిస్తుంది. బంధువులందరూ వచ్చి, మరణించిన అతడి శరీరానికి దహన సంస్కారం చేయదలచి, అతడి శరీరాన్ని బయటకు తీసుకుని వెళ్ళడానికి ప్రయత్నిస్తారు. కానీ, యోగప్రక్రియవల్ల అష్టవంకరులుగా అయిపోయిన అతడి శరీరం, ఆ యింటికి వున్న చిన్న ద్వారం గుండా బయటకి రావడం సాధ్యం కాకపోయేసరికి, బంధువులు ఆ గుమ్మాన్ని కోసి, ద్వారం పెద్దది చేద్దామని, పనిముట్లు తీసుకొని వస్తారు.

అది చూసి, ఆ శిష్యుడి భార్య, 'అయ్యో! అయ్యో! పోయిన ఆయన ఎలాగూ పోయాడు. నేనూ, నా పిల్లలూ వుండటానికి యీ ఒక్క యిల్లు తప్ప వేరేదీ లేదు. ఆయన శరీరం బయటకి తీసుకురావటం కుదరకపోతే, ఆ కళేబరం యొక్క అవయవాలని ఖండించండి' అని ఆమె అంటూ వుండగానే, తన సమాధిస్థితిని వీడి బాహ్యప్రజ్ఞ వచ్చిన ఆ శిష్యుడి చెవులలో, తన భార్య అంటున్న మాటలు పడతాయి. వెంటనే అతడు తిరిగి తన మామూలు స్థితికి వచ్చేసి, భార్యాపుత్రుల ప్రేమలు చిలకలపూడి బంగారమే కదా! అని భావించి, అత్యంత విరక్తితో వారిని వదలి, సత్య మార్గాన్వేషియై వెళ్ళిపోతాడు.

చూశారా! మానవుడు తన యింద్రియాలని అదుపులో పెట్టుకోలేక, అన్ని విషయాలకీ తలవంచుతున్నాడు. కానీ ఎవరి ముందు తలవంచితే యిక తలవంచనక్కరలేదో, అటువంటి సత్యగురుమూర్తి ముందు మాత్రం తలవంచడు. ఏ గురుపాదుకలయితే తనని పాపముల నుండి, దుఃఖము నుండి, కలుషముల నుండి రక్షిస్తాయో, అట్టి గురుపాదుకలని ఆశ్రయించాలి.

'నేను - నాది' అనేది దూరమైననాడు 'నీవు నీవుగా' నిలిచిపోతావు. అప్పుడు **'తత్ త్వమ్ అసి'** 'అది నువ్వు' అంటే ఆత్మవస్తువు నీవు - అని తెలుసుకుంటావు అని చెప్పేవారు సద్గురుదేవులు.

మారుతి ఆ విధంగా తన యిష్టదైవమైన శ్రీరామునియందే తన గురుమూర్తిని దర్శించగలిగాడు. తన గురుదేవుడయిన రాముని యందే బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులని దర్శించి, ఆయననే సాక్షాత్ పరబ్రహ్మముగా నెంచి, చతుర్విధ శుశ్రూషలతో గొలిచి అనఘుడు

అయ్యాడు పావని. అంటే పాపరహితుడయ్యాడు. అంతేకాదు, జ్ఞానులలోనే అగ్రగణ్యుడయ్యాడు.

'నేను - నాది' అనే అహంకార మమకారములు రహిత మవ్వాలంటే అది కేవలం సద్గురువులనాశ్రయించి, వారు ప్రసాదించిన లక్ష్యార్థసాధన వల్లనే సాధ్యమవుతుంది. కనుక అటువంటి సద్గురుదేవుల నాశ్రయించి, శాశ్వతానందాన్ని జుర్రుకుని, అఖండభక్తి, జ్ఞాన వైరాగ్యముల తోను, అఖండైశ్వర్య భోగ భాగ్యములతోనూ సర్వులూ తులతూగెదరు గాక!"

## హైదరాబాదు శాఖలో కార్యక్రమాలు

**కార్యక్రమాలలో ఏమైనా మార్పులు వుంటే ఎప్పటికప్పుడు హైదరాబాద్‌శాఖవారి వాట్సప్ గ్రూప్‌లో తెలుపబడును......**

**ఆగస్ట్ 2024**

2 శుక్ర: మాసశివరాత్రి

19 సోమ: శ్రావణ(రాఖీ) పూర్ణిమ, - ఉ.11.00 గం.లకు సత్సంగం శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

26 సోమ: శ్రీ కృష్ణాష్టమి - సా.5.30 గం.లకు సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

28 బుధ: శ్రీ గురుదశమి - సా.5.30 గం.లకు సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

**సెప్టెంబర్ 2024**

7 శని : వినాయకచవితి - సా.5.30 గం.లకు, సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

18 బుధ: భాద్రపద పూర్ణిమ - సా.5.30 గం.లకు సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

27 శుక్ర: శ్రీ గురుదశమి - సా.5.30 గం.లకు సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

# శ్రీ కాళీ తత్వము

- ప్రసాద వర్మ కె.

శ్రీ శంకర భగవత్పాదుల సంకల్ప బలం చేత శ్రీవిద్యా సంప్రదాయం ఒక ఉత్కృష్ట ఉపాసనా మార్గంగా ఆ సేతు హిమాచలం స్థిరపడింది. పరమాత్మను మాతృ రూపంలో ఉపాసించడమన్నది ఆర్షమతమున యుగ యుగాల నుండి కొనసాగుతోంది. దీనికి మూలం దేవీ సూక్తంలో వున్నదని పండితుల మాట. కృపా ప్రపూర్ణయగు శ్రీమాత ఉపాసకుల ఊహకు ఒదిగిందా అన్నట్లు వివిధ రూపాలలో దర్శనమిచ్చింది. జీవుల చిత్త పరిపాకాన్ని బట్టి, స్థాయి భేదాలను బట్టి ఉపాసించి తరించుటకు మార్గమేర్పరచుటయే ఈ లీల.



సప్త మాతృకలుగా, నవ దుర్గలుగా, అష్టాదశ శక్తి పీఠాల అధిదేవతలుగా, దశ మహావిద్యలలో ఆ పరదేవత అంశలు పరిపరి విధాల విశ్వవ్యాప్తమై వున్నవి.

కృష్ణవర్ణంతో ప్రకాశించే శ్రీకాళీదేవి దశమహావిద్యలలో మొదటి మహావిద్య. ఆశ్వయుజమాసం, కృష్ణ పక్షమి అష్టమీ తిథి ఈ దేవికి ప్రీతిపాత్రమైనది. శ్రీకాళికాదేవి ఉపాసన ఎంతో ఉత్కృష్టమైనదిగా శాక్తేయ సాంప్రదాయం చెబుతోంది. శ్రీకాళీ మహావిద్యని ఆరాధిస్తే సకల వ్యాధుల నుంచి, బాధల నుండి విముక్తి కలుగుతుంది. శత్రునాశనం, సకల లోక పూజత్వం, దీర్ఘాయువు, సాధకుడికి కలుగుతుంది అని పురాణాలు చెబుతున్నాయి.

'కాల' శబ్దానికి స్త్రీ లింగ రూపం కాళి. కాలం అంటే ఎప్పుడూ వున్నది. కాలం అన్నీ చేయిస్తుంది. కాలమే కర్త. ఏ విధమైన సృష్టిగాని, సూర్యచంద్రాది గ్రహములు గాని లేని సమయమున వున్నది కేవలం అంధకారం మాత్రమే. శ్యామ వర్ణోపేత స్థితి నుండి సృష్టి ఉద్భవించినది. కాళికా దేవి కృష్ణ వర్ణము. చీకటి నుండి పుట్టిన సృష్టికి ప్రతీకాత్మకమైనది. ప్రకృతిని కాచి సంరక్షించునది కాళికా పరమేశ్వరియే. మహాకాళుని శక్తిగా, లయకారిణిగా ఋషులామెను సంభావించారు. యుద్ధభూమిలో పుట్టిన మూలములున్ననూ ఆమె సంపూర్ణ మాతృత్వ ప్రకృతిగా

పరిణామం చెంది, సృష్టి, స్థితి, లయములకు ఆలవాలమైనది. ఆమె ఉగ్రరూపము, సంహారాది గుణములను చూసి ఆరాధించుటకు సంశయ భీత మనస్కులవుతారు. కాని ఆ తల్లి భౌతికావరణను దాటి చూస్తే మాతృత్వ మమకారము, భక్త వాత్సల్యము గోచరిస్తాయి. కాళీమాత ఉగ్రరూపమెంత తీవ్రమైనదో అంతకన్న అధికతరమైన ప్రేమ కురిపించు చల్లని తల్లి. శరణాగతులకు క్షేమంకరి, దుష్ట శత్రువులకు భయంకరి.

కాళీదేవి అవతరణను గూర్చి పురాణాలలో ఎన్నో వివరణలు కథలు కానవస్తాయి. మొదటగా పేర్కొనదగినది చండీసప్తశతి. మధుకైటభ వధ సందర్భంలో, ఆ రాక్షసరాజు సేనాపతి రక్తబీజుడు భయంకరంగా యుద్ధం చేస్తున్నాడు. సింహవాహినియై దుర్గ వానికి ధీటుగా యుద్ధం చేస్తున్నది. కానీ, ఏ ఆయుధమైనా తగిలితే కారే రక్తపు చుక్కల నుండి అనేకమంది రక్తబీజులు పుట్టుకు వస్తున్నారు. వాడిని చంపాలంటే రక్తపు చుక్కలు నేలపై పడకుండా చేయాలి. మరొక శక్తి సహాయం వుండాలనుకున్న దుర్గాదేవి సంకల్పంతో ఆమె శరీరం నుండి కాళిక ఉద్భవించి, తన నాలుకను నేలపై పరచగా దానిపై పడిన రాక్షసుని రక్తాన్ని ఆమె త్రాగి వాడిని శక్తి హీనుణ్ణి చేసి, సంహరించింది. నాటి నుండి కాళిక అంటే శత్రుసంహారిణిగా ఆరాధింపబడుటయే గాక, కాళికాదేవి అంటే రక్తపానం చేసే దేవత అని ఒక నానుడి లోకంలో ఏర్పడింది. ఎర్రని నాలుక చాపినట్లుగా ఆ దేవతా మూర్తి చిత్రణ జరుగుతూ వస్తోంది.

మహా ప్రళయవేళ సర్వ సంహార శక్తి అయిన కాళిక మహా తాండవం చేస్తున్నది. ఆమె పాద ఘట్టనలకు సమస్త లోకములు దద్దరిల్లి పోతున్నాయి. దిక్పాలకులతో సహా దేవతలందరూ భయభ్రాంతులై పోయారు. అప్పుడు పరమేశ్వరుడు లోకరక్షణ కోసం ముందుకు వచ్చాడు. దేవీ నీ పాదఘాతములకు సమస్త బ్రహ్మాండములు అల్లకల్లోల మవుతున్నాయి. ఇదిగో నా శరీరాన్ని నీ ఆధీనం చేస్తున్నాను. ఈ దేహంపై కాలు మోపు అన్నాడు శివుడు. ఈశ్వరాజ్ఞను అంగీకరించి శివునిపై నిలుచున్నది. ఆనాటి నుండి **శివారూఢా** అయినది కాళిక. ఆమె కాలి క్రింద శివుడు వున్నట్లుగా చిత్ర, శిల్పాదులు వెలిశాయి.

- సశేషం

# నిరీక్షణా మాధుర్యము - పాలూరి కాళీప్రసాద్

భగవంతుని దర్శించుకోవాలనే ఆర్తితో మనం ఎన్నో పుణ్య క్షేత్రాలకు, ప్రసిద్ధ దేవాలయాలకు వెళతాం. తీరా అక్కడికి వెళ్ళిన తరువాత దర్శనానికి పెద్ద లైను వుంటుంది. తిరుమల లాంటి చోట్ల అయితే కొన్ని గంటలో, ఒక్కొక్కసారి రోజు పైనే పట్టవచ్చు. ఇంతా కష్టపడి ఆలయం లోనికి ప్రవేశించాక గట్టిగా కొన్ని క్షణాలు కూడా ఆ దివ్యమంగళ మూర్తిని దర్శించుకోనివ్వరు. పదండి, పదండి అని త్రోసివేస్తారు. ఇంకా కొందరు ఉంటారు. అందరూ ఒక వరుసలో వెళ్తుంటే వీరు వరుస తప్పి ప్రక్కకు జరిగి, ఆ దేవతామూర్తికి అడ్డంగా నిలబడి పరమ భక్తితో ఎంతోసేపు నమస్కరిస్తూ, స్తోత్రాలు చదువుతూ నిలబడిపోతారు. ఇక వెనుకవారు వీళ్ళవీపులనో, కొప్పులనో దర్శించుకొని పోవలసిందే కానీ, వీరు మాత్రం అక్కడినుండి కదలరు. కనీసం, మనతోపాటు వరుసలో ఉన్న వారందరూ భక్తులే కదా, మనకు ఆ పరమాత్మను దర్శించుకొనే హక్కు ఎంత వుందో వారికి కూడా అంతే ఉంది కదా అనే ఆలోచనే వీరికి రాదు.

ఇంకొంతమంది వరుసలో నిలుచున్నంత సేపూ వారు భగవంతుని తలచుకోకపోగా ప్రక్కవారిని అనేక ప్రశ్నలతో విసిగిస్తూ ఉంటారు. "మీ పిల్లలు ఏమి చేస్తున్నారు? ఆహా, కాలేజీకి బస్సు వస్తుందా, మీరే దింపాలా? మీ అబ్బాయికి ఇంకా ఎందుకు పెళ్ళి కాలేదు?" ఇలా ఎందుకూ పనికిరాని ప్రశ్నలతో వారి మనశ్శాంతిని చెడగొడుతూ వుంటారు. పోనీ ఆ ప్రశ్నల వలన వీరికి కానీ, వారికి కానీ ఏమన్నా వుపయోగం ఉందా? అంటే ఏమీ ఉండదు. నిజంగా అవతలి వారికి ఏమన్నా సహాయం అవసరమైన సందర్భంలో వీరు కనీసం ముఖం కూడా చూపించరు. మరి ఎందుకు ఈ వృథా కంఠక్షోభ? నిజానికి భగవద్దర్శనం అనేది చాలా కొద్ది క్షణాలే లభిస్తుంది. మన పురాణ ఇతిహాసాలలో ఎందరో భక్తులు, రాజులు, రాక్షసులు అనేక వందల, వేల సంవత్సరాలు తపస్సు చేస్తే భగవంతుడు ఇలా ప్రత్యక్షమై, వరమిచ్చి, అలా మాయమై పోతాడు. కానీ అసలైన భగవద్దర్శన మాధుర్యం ఆయన దర్శనం కోసం నిరీక్షించడం లోనే ఉంది.

శబరి తల్లి రామునికోసం ఎన్నో సంవత్సరాలు నిరీక్షించింది. 'రాముడు వచ్చినప్పుడే ఆయనకు సేవలు చేద్దాంలే' అనుకొని తన సమయాన్నంతా ఇతరులతో పోచికోలు కబుర్లు చెప్పడానికి వుపయోగించలేదు. ప్రతిరోజూ ఈ రోజే రాముడు వస్తాడనే విశ్వాసంతో నిరంతర రామ స్మరణతోనే తన కుటీరాన్ని, అక్కడికి చేరే మార్గాన్ని అంతా

చక్కగా అలికి, ముగ్గులు పెట్టి, పూరేకులతో అలంకరించి, రామునికోసం నీటిని, మధుర ఫలాలను సేకరించి సిద్ధంగా ఉండేది. ఇలా నిరంతర రామ నిరీక్షణా మాధుర్యాన్ని ఒక తపస్సుగా అనుభవించింది కనుకనే నిజంగా ఆ రాముడు వచ్చి తనవద్ద కొద్ది క్షణాలే గడిపినా వెంటనే తన ఆత్మ రామునిలో లీనమై, దేహం కూడా నదీరూపాన్ని ధరించి శాశ్వతత్వాన్ని పొందింది. అలా మాధుర్యాన్ని అనుభవించకుండా కేవలం దర్శనం కోసమే తపస్సు చేసి, తీరా భగవంతుడు ప్రత్యక్షం అయ్యాక తమకు ఎందుకూ పనికిరాని, లోకాలకు హానికారకమైన వరాలను అడిగి ఎందరు రాక్షసులు నాశనం అయిపోలేదు?

కాబట్టి ఎంతసేపు దర్శనం అయ్యింది? మనం వెళ్ళిన రోజున ఆ దేవతా మూర్తికి ఎన్ని అలంకారాలు చేశారు, ఇలాంటివి ముఖ్యం కాదు. మనం ఇంటి దగ్గర బయలుదేరిన దగ్గరినుంచి, లేదా అసలు మనకు పుణ్యక్షేత్రానికి వెళ్ళాలనే సంకల్పం కలిగిన క్షణంనుంచి మనం ఎంతసేపు ఆ పరమాత్మను తలుస్తూ, ఆ స్మరణలో గడిపాము? అనే దానిపైనే ఆ దర్శనంలో మనం అందుకొనే మాధుర్యం ఆధారపడి వుంటుంది. నిజానికి అలా నిరంతర భగవన్నామ స్మరణ జరగాలనే దేవాలయాలలో ఎవరో భక్తులు సంకీర్తన చేస్తూ ఉండటమో, ఆ సౌలభ్యం లేని చోట్ల ఏ సిడిలోనో భజనలు వినిపించడమో చేస్తూ వుంటారు. మనం దర్శనానికి వరుసలో నిలబడినప్పుడు ప్రక్క వారితో లోకాభిరామాయణం మాట్లాడటం మానుకొని ఆ సంకీర్తన మనం చేయలేక పోయినా, కనీసం వినే ప్రయత్నం చేస్తే, అందులో ఏదో ఒక కీర్తన తప్పక మన హృదయానికి తాకుతుంది. అలా తాకిన కీర్తన మనం దర్శనం చేసుకొని ఇంటికి వెళ్ళి పోయినా, ఆ రోజంతా ఏ పని చేస్తున్నా మన మనస్సులో తిరుగుతూనే ఉంటుంది. ఇంతకన్నా ధ్యానం ఏముంటుంది?

అలా నిరంతర భగవన్నామ స్మరణ కన్నా గొప్ప సాధన మరొకటి లేదు. మెల్లమెల్లగా మనస్సు ఆ రుచికి అలవాటు పడితే, బయటి విషయాలపై ఆసక్తి తగ్గి, ఎక్కడ ఏ పరిస్థితిలో ఉన్నా మనస్సు భగవంతుని వైపే లాగుతూ ఉంటుంది. అట్టి సాధనకు ఫలితంగా కేవలం గర్భాలయంలో మూలవిరాట్టులో మాత్రమే భగవంతుని దర్శించే స్థితినుండి, మన చుట్టూ ఉండే సర్వ ప్రకృతిలో, సమస్త మానవాళిలో ఆ పరమాత్మనే దర్శించే స్థితికి చేరుకుంటాం. మానవ జన్మ ఎత్తినందుకు అదే సార్థకత.

# మరి మరి నిన్నే మొరలిడ

- భాగవతుల జయప్రద

ఒక ఊరిలో ఒక భక్తుడు ఉండేవాడు. పూర్వజన్మ సంస్కారం వలన, అతనికి ఒక గురువు లభించారు. ప్రతి రోజు ఆ గురువు గారు చెప్పే బోధకి, ఆయన యొక్క సన్నిధిలో పొందే శాంతి కోసం నిరంతరం ఆరాటపడుతూ ఉండేవాడు. గురువు గారి ఆశ్రమానికి వచ్చే భక్తులు "స్వామీ! మీరు మా ఇంటికి ఆతిధ్యానికి రావాల"ని ప్రార్ధిస్తూ ఉండేవారు. గురువుగారు కూడా వీలు చూసుకుని వారి వారి గృహాలకి వెళ్ళి, బోధని అందించి, కావాల్సిన ఆధ్యాత్మిక మార్గాన్ని బోధించేవారు. ఇదిలా వుండగా ఒకనాడు అతనిలో ఒక ఆశ కలిగింది. "నేను కూడా గురువుగారిని మా ఇంటికి ఆహ్వానించాలి" అని అనుకున్నాడు. "వారు వస్తే నా మనస్సు ఎంతో సంతోషపడుతుంది. ఆయన పాదసేవ చేసుకుని నేను ధన్యుణ్ణి అవ్వాలి, ఆయనకి ఆతిధ్యాన్ని ఇచ్చి ఈ జన్మను సార్ధకం చేసుకోవాలి" అని అనుకున్నాడు. ఆలోచన చాలా గొప్పగా అనిపించింది అతనికి. ఒకరోజు, గురువు గారిని ఇలా ప్రార్ధించాడు . "స్వామీ! మీరు నా యందు దయ ఉంచి మా ఇంటికి ఆతిధ్యానికి రావాలి, మా కుటుంబము మొత్తం మీ పాదసేవ చేసుకుని, ఆధ్యాత్మిక సాధనలో ముందుకు వెళ్ళాలి" అని అనుకున్నాము అని అర్ధించాడు. దానికి గురువుగారు "తప్పకుండా వస్తాను నాయనా!" అన్నారు.

అతడు దానికి సంతోషపడి ఆ రోజుకి ఇంటికి వెళ్ళిపోయాడు. మరునాడు మళ్ళీ అడిగాడు. గురువుగారు "తప్పకుండ వస్తా నాయనా!" అన్నారు. ఇలా ప్రతిసారి అడగటం, ఆయన వస్తాను అని అనడం. కానీ ఎప్పుడు వస్తారో చెప్పకపోవడం. ఇది చాలా అయోమయస్థితిలో పడేసింది అతనిని. ఏమి చెయ్యాలో తెలియని పరిస్థితి ఏర్పడింది. ఇహ ఉండబట్టలేక పోయాడు. ఒక రోజు గురువు గారిని అడిగాడు. "స్వామీ! మీరు వస్తాను, వస్తాను అని అంటున్నారు కానీ ఎప్పుడు వస్తారో చెప్పడం లేదు, ఎప్పుడు వస్తారో చెప్తే, నేను దానికి తగిన ఏర్పాట్లు చేసుకుంటాన"ని.

అప్పుడు గురువుగారు, "నీ ఇంటికి రమ్మని ఆహ్వానించావు, సంతోషం. నీ మనసులోకి రమ్మని ఎప్పుడైనా నన్ను ఆహ్వానించావా?" అని అడిగారు. దానికి అతని నోట మాట రాలేదు. ఎంత సేపు "స్వామీ! మీరు మా ఇంటికి రండి, మీరు వస్తే మేము మీకు సేవలు చేస్తాం,

చాలా మందిని పిలుస్తాం, గొప్పగా ఆతిథ్యం ఇస్తాము అనేటువంటి ఆలోచనలలోనే నీవు ఉన్నావు. ఒకసారి నీ మనసు లోపలకెళ్ళి చూడు" అని చెప్పారు. భక్తుడు ఆలోచనలో పడ్డాడు. అంతకు మించి విచారణలో పడ్డాడు. 'గురువుగారు ఎందుకని అలా అన్నారు. నేను ఆయన చెప్పినట్లే చేస్తున్నాను కదా. ఎందరినో అనుగ్రహించారు వారు. మరి మా ఇంటికి వచ్చేసరికి ఎందుకు అప్పుడు, ఇప్పుడు అని దాటవేశారు, పైగా మనసులో చూడమంటున్నారు. నా మనసులో ఆయన తప్ప వేరు ఎవరు ఉన్నారు?' అని ఇటువంటి ఆలోచలనతో సతమతమవుతున్నాడు .

గురువుగారు అలా అన్నారు అంటే, ఇందులో ఎదో నిగూఢార్థం ఉండే ఉంటుంది అని వివేకంతో విచారణ మొదలుపెట్టాడు. తన మనసు లోని లోపాలని గుర్తించాడు. వాటిని ఎలా సరిచేసుకోవాలో ఆలోచించ సాగాడు. దాని కోసం సాధనని మొదలు పెట్టాడు. విచారణతో కూడిన నిరంతర నామస్మరణని అభ్యాసం చేయడం అలవాటు చేసుకున్నాడు. అదే ఉపాసనగా మారింది. అందులోని ఆనందాన్ని అనుభవించ సాగాడు.ప్రతి కదలికలోను తన గురువునే చూడటం తనకు తెలియ కుండానే జరుగుతోంది (**న ద్వితీయోస్తి కశ్చిత్**).

ఇలా కొన్ని నెలలు గడిచాయి. ఆ తరువాత ఆ శిష్యుడు ఒక సాధకుడుగా మారాడు. గురువుగారి ఆజ్ఞని తు.చ. తప్పకుండ పాటించడం మొదలు పెట్టాడు. ఇదిలా ఉండగా ఒక రోజు అడగ కుండానే, గురువుగారు, "నేను ఇవాళ మీ ఇంటికి వస్తున్నాను" అని అన్నారు. ఆ రోజున, నిజానికి ఆయనకి ఆతిథ్యమివ్వడానికి ఇంటిలో ఏమీలేవు. ముందుగా ఏదీ సరిచూసుకో లేదు. అయినా కూడా అన్నీ సక్రమంగానే జరిగిపోయాయి. గురువుగారు పరమ అనుగ్రహంతో ఆ కుటుంబాన్ని దీవించారు. ఆ శిష్యుడు పొందిన ఆనందానికి అవధులు లేవు. భగవంతుడు (శ్రీ గురుదేవుడు) సర్వాంతర్యామి అయినప్పుడు, మన మనస్సులో లేరు అని అనడానికి వీలు లేదు. శుభ్రమైన ఇంటిలో మనం ఎలా అయితే ఉండటానికి ఇష్టపడతామో, అలాగే పరిశుద్ధమైన మనస్సులో ఉండటానికి భగవంతుడు ఇష్టపడతాడు. అందుకనే మనస్సుని శుభ్రపరుచుకోవడం ఇంటిని శుభ్రపరుచుకోవడం కన్నా ఎంతో గొప్పది. అది ఆధ్యాత్మిక సాధనకి చాలా దోహదం చేస్తుంది అని అనుభవ పూర్వకంగా సాధకులకి తెలియజెప్పేవారే మహాత్ములు.

# ధ్యానం

-కీ.శే జానకిరామ శాస్త్రి

మన ఇష్ట దైవాన్ని భక్తి, విశ్వాసాలతో దరిజేరడానికి మహాత్ములు ఎన్నో విధానాలను అందించారు. ఈ సందర్భంలో ధ్యానం అంటే భగవంతునిపై ధ్యానం అని అర్థం. ఇష్ట దైవంపై ధ్యానం చేయటం అంటే – స్థిరాసనంలో కూర్చుని, మనస్సును నియంత్రించి ప్రకాశవంతమైన ఆ దైవం యొక్క రూపాన్ని దర్శిస్తూ ధ్యానించాలి. మీ స్వభావమేదైనా, మీ రుచి ఏదైనా, మీ ధ్యానానికి అనుకూలమైన ఇష్టదేవతల ప్రత్యేక ఆకృతులను దర్శించి వాటితో అనుబంధం ఏర్పరుచు కోవాలి. శరీరంలోని కదలికలను నియంత్రించి నిలకడగాచేసి, బాహ్య వృత్తులపై సంచరించే మనస్సును అంతర్ముఖం చేసి, నిశ్చలంగా ఉంచి, ఆలోచనలను స్తంభింపచేసి భగవంతునిపై ఏకాగ్ర చిత్తంతో ఉంచటమే నిజమైన ధ్యానం.

పరస్పర విరుద్ధమైన ఆలోచనలను త్యజించి, మనస్సును ఒకే ఆలోచనపై కేంద్రీకృతం చేసి ఆ ఆలోచనా రూపాన్నే అవిరళ ధారగా మార్చి నిశ్చలంగా ఉంచి, తాను ధ్యానం చేస్తున్న రూపంలోని ఆ పరమసత్యం వైపు మనస్సును మళ్ళించాలి. ఈ సాధనా క్రమంలో తన మనస్సు ఏ రూపంపై ధ్యానం చేస్తుందో, ఏ రూపంపై మనస్సు నిశ్చలంగా ఉండాలో ఆ రూపాన్ని, నామాన్ని నిరంతర స్మరణ చేయాలి. ఈ నామస్మరణ అత్యంత ప్రధానమైన విషయం. అది ఒకే ఆలోచనా విధానాన్ని దృఢపరుస్తుంది. ఒక క్షణమాత్రం మనస్సు తన ఆలోచననుండి కదిలిపోయినా మరుక్షణం తన ధ్యాన వస్తువుపై నిలిచి పోతుంది. నది ఇరువైపులా ఉన్న తీరాలు నదిని సజావుగా ప్రవహించేలా ఎలా వుపకరిస్తాయో అదే విధంగా నామస్మరణ ధ్యానం నిరాటంకంగా సాగేటట్లుగా చేస్తుంది. తాను ఎన్నుకున్న ధ్యానవస్తువు వైపు ఆలోచనా ప్రవాహం ప్రవహించడానికి భగవంతుని దివ్య నామస్మరణ తోడ్పడుతుంది. ధ్యానం చేయగా చేయగా, అత్యంత సూక్ష్మమైన ప్రాణం క్రమబద్ధీకరింపబడుతుంది. నియంత్రించబడుతుంది.

మనస్సు, ఆలోచనా విధానం, ప్రాణం పరస్పరం సంబంధంగల అంశాలు. ప్రాణాన్ని క్రమబద్ధీకరించడం వల్ల ఆలోచనా స్రవంతి ఏకాగ్రత పొందుతుంది. తన ఇష్ట దైవంపై ధ్యానం చేయదలచిన వారు ఒక స్వరూపంలో స్థిరపడతారు. ఆ స్వరూపం ఎంతో అందంగా, కాంతివంతంగా ఉంటుంది. అది లౌకిక స్థూలరూపం కాదు. ఒక ఆధ్యాత్మిక స్వరూపం. కాంతి, అందం, దివ్యత్వం, దాని గుణాలు. ఎన్నుకున్న స్వరూపాల్లో వ్యత్యాసం ఉంటాయి.

వేదాంత ధ్యానం – ఎవరైతే అవ్యక్తతత్వంపై వేదాంత ధ్యానం చేయదలచు కుంటారో, వారు అనంత అస్తిత్వంగల ఆ పరబ్రహ్మ స్థితిని స్మరించడమే వేదాంత ధ్యానం. వారు బాహ్య విశ్వానికి సంబంధించిన అన్ని నామరూపాల ఆలోచనలు

సంపూర్ణంగా వదలివేసి, నామ రూపాలకతీతంగా నామరహిత, రూపరహిత, పరమ సత్యంలో స్థిరపడతారు.

కొందరు తమలోని అంతరాత్మనే శాశ్వత సత్యంగా భావిస్తూ, ఆ తత్త్వంపై ధ్యానం చేస్తారు. “నేను ఈ శరీరం కాదు, మనస్సు కాదు, ఇంద్రియాలు కాదు, బుద్ధి కాదు, నేనొక నామ రూపాలుగల వ్యక్తిత్వం కాదు. నేను అనంతమైన, జననమరణాలు లేని శాశ్వత సత్యాన్ని” అనే భావనతో ధ్యానం చేస్తారు. మానవ వ్యక్తిత్వం ఒక మాయగా భావిస్తారు. వారు ధ్యానావస్థ నుండి మేల్కొనగానే, ధ్యానంలోని “నీవు” అంతర్ధాన మైపోతుంది. అదే విధంగా, ఈ ప్రస్తుత చైతన్యస్థితి తాత్కాలికస్థితి. ఆ “సత్య” చైతన్యస్థితి లోకి మేల్కొనగానే, ఈ “నేను” అన్న వ్యక్తిత్వానికి అస్తిత్వమే లేదు. అన్న విషయాన్ని గ్రహిస్తారు. “నేను” అన్న వ్యక్తిత్వాన్ని పూర్తిగా నిరాకరించి, తమలోని అనంతమైన అస్తిత్వంపై ధ్యానం చేస్తూ, ఆ అద్వయ చైతన్యంలోనికి ప్రవేశిస్తారు. ఆ శుద్ధతత్వంలో ఏకమై పోతారు.

అయితే ధ్యాన స్థితికి చేరడం ఎలా? పైన ఉదహరించిన విషయాలను అనుసరిస్తే క్రమంగా మన అంతరంగం ధ్యానస్థితిలోకి చేరే స్థాయికి చేరుతుంది. ఏ ఏ పరిస్థితులవల్ల మనస్సు కలవర పడుతున్నదో గమనించాలి. వాటినుండి మనస్సుని మరలించాలి, అప్పుడే మీరు ధ్యానానికి ఏ పద్ధతిని ఎన్నుకున్నా అది సఫలీకృతమౌతుంది. రోగిని నయం చేయడానికి వైద్యుడు ఏ మందు సేవించాలో సూచిస్తాడు. ఆ మందు సేవించాల్సింది రోగి మాత్రమే. గురువు ధ్యానం ఎలా చేయాలో ఉపదేశిస్తాడు. సాధన చేయాల్సింది సాధకుడే. ధ్యానం చేయడానికి వంద పద్ధతులు ఉండవచ్చు, మీకు ఏ పద్ధతి అనువుగా ఉంటుందో ఎంచుకుని, దానికి కట్టుబడి నిష్ఠతో ఆచరించాలి.

మన ఆశ్రమంలో శ్రీ మాతాజీ వారి అధ్వర్యంలో శ్రీరామ నామ మౌన ధ్యానాలు నిర్వహింపబడుతున్నాయి. ఇందులో ముఖ్యంగా ఒకే ఆసనంలో రెండు గంటల సేపు ధ్యానం చేయిస్తారు. మనస్సులో రీలులాగా తిరిగే ఆలోచనలు కట్టడి అవటానికి కొంత సమయం పడుతుంది. ఆ తరువాత నువ్వనుకున్న రూపం మీద గాని, సద్గురువులు ప్రసాదించిన లక్ష్యార్థంపైన గాని నిలబడుతుంది. ఆలోచనలు రావటం తొలగిపోయిన తరువాత నీ మనస్సు ఏకాగ్రత చెంది ఆనందం లభిస్తుంది.

“లోకాస్సమస్తా సుఖినోభవన్తు”.

# జపాన్ దేశ మతాలపై నా అవగాహన

- డా॥ పి. సుధారాణి

గురుదేవుల అనుగ్రహంతో మా చిన్న అబ్బాయి జపాన్‌లో ఉద్యోగం చేస్తూ వుండటం వలన ఇటీవల అక్కడకు వెళ్ళటం జరిగింది. గురుదేవులు ఒక విషయం స్పష్టంగా బోధించారు. విశ్వాన్ని సృష్టించి, నడిపించి, అంతమొందించేది ఒకే ఒక్క మహాశక్తి. అదే పరమాత్మ, ఆ శక్తి వివిధ మతాలవాళ్ళు ఏ రూపంగా ఆరాధించినా, ఆ రూపంతోనే వారిని అనుగ్రహిస్తుంది. మాతాజీ యూరప్ మరియు అమెరికా పర్యటనలలో భౌతిక కట్టడాలైన ఎన్నో చర్చిలు, మసీదులు చూపించారు. అందువలన జపాన్‌లోని మతాల గురించి తెలుసుకోవాలని వుత్సాహం కలిగింది.

జపాన్‌లో కొంతమంది దగ్గర దగ్గర అర్ధభాగం ఏ మతమూ అనుసరించకపోయినా, మిగతావారు స్వదేశీమతమైన షింటో మతము, విదేశీమతమైన బౌద్ధమతం అనుసరిస్తారు. సందర్శకులకు రెంటికీ మధ్య పెద్ద తేడా తెలియదు.

**షింటో మతంలో** 8 మిలియన్ల దేవుళ్ళు. మన ద్వైత మతానికి కొంచెం దగ్గరగా వుంటుంది. వీరు ప్రకృతినే పరమాత్మగా ఆరాధిస్తారు. ఈ దేశంలో ప్రకృతి వైపరీత్యాలు ఎక్కువ. భూకంపాలు, సునామీలు, అగ్నిపర్వత విస్ఫోటాలు మొదలైనవి.

అతి ప్రాచీన కాలంలో ప్రజలు ప్రకృతి మీద ఆధారపడి జీవించే వారు. ఆహారము, నీరు, నివాసములకు ప్రకృతే ఆధారం. కాబట్టి ప్రకృతి ఆగ్రహిస్తే, వారికి నిలువ నీడ ఉండదు. అందుకని ఫౌంట్ ఫుగి అగ్ని పర్వతము, భూమి, సముద్రము మొదలైన వాటిని ఆరాధిస్తారు (మనం అష్టమూర్తులను ఆరాధించినట్లు) వాటి నివాసమే ష్రైన్స్ అంటారు. ష్రైన్‌కి ఎరుపు రంగు, టారిగేట్ ద్వారా ప్రవేశం వుంటుంది. (ఉదాహరణకు మన ఆశ్రమానికి రామానంద ద్వారం అనుకోవచ్చు) టారిగేట్ దాటాక అంతా పవిత్రస్థలమే. పచ్చని చెట్లు, రంగు రంగుల పూలు, చిన్న నీటి కాలువలు మనోహరంగా కొన్ని ష్రైన్స్ లో కనిపిస్తాయి. పవిత్రమైన పెద్ద చెట్లకు (మన మఱ్ఱి, రావి చెట్లవంటివి) మందమైన తాడు అందంగా

ముడి వేసి పెడతారు. మొక్కులు తీరడానికి అందమైన రంగు వున్న రేపర్స్ పొడుగ్గా కడతారు. ఆ రేపర్స్ కూడా ష్రైన్ బయటనే అమ్ముతారు.

ముఖ్య ఆలయానికి బయట వాటర్ బేసిన్ వుంటుంది. మనం చలివేంద్రంలో పెట్టే కుండవంటిది. నీరు తీసుకోవడానికి గరిట వుంటుంది. గరిటతో నీళ్ళు తీసుకుని మొదట ఎడమ చేతిని, తరువాత కుడిచేతిని కడుక్కుని, తరువాత నోరు కడుక్కుని గరిట పైకి లేపాలి. మిగిలిన నీటితో హ్యాండిల్ తడుస్తుంది. గరిట బోర్లించి పెట్టాలి. ఈ విధంగా మనల్ని మనం శుద్ధి చేసుకుని, ముఖ్య ఆలయంలోకి ప్రవేశించాలి. మూల విగ్రహం వుండదు. అలంకారం మాత్రం వుంటుంది. ప్రకృతిని చిన్న రూపంలో బంధించలేరు కదా అని నా భావన.

గర్భాలయానికి ఎదురుగా పెద్ద హుండీ వుంటుంది. దాని ఎదురుగా నిలబడి కాయిన్స్ విసిరి హుండీలో వేసి, గంట కొట్టి, 3సార్లు వంగి, లేచి, 2సార్లు చప్పట్లు కొట్టి దేవతను పిలవడానికి కనులు మూసుకుని, కోరికలు కోరుకుని, ప్రార్థించి, మళ్ళీ 3సార్లు వంగి చేస్తారు. గర్భాలయం బయట వస్తాదులవంటి విగ్రహాలు (పిశాచాలను భయ పెట్టడానికి) వుంటాయి. పిల్లలు పుట్టినప్పుడు, వివాహాలు అయినప్పుడు వారిని తీసుకువచ్చి అనుగ్రహించమని దేవతలను ప్రార్థిస్తారు. పంటల కోసం పండుగలు, ప్రార్థనలు చేస్తారు (మన సంక్రాంతి వంటివి.)

బౌద్ధ మతం మన అద్వైతానికి కొంచెం దగ్గరగా వుంటుంది. శాశ్వత దుఃఖ నివారణ, జ్ఞాన ప్రాప్తి కొరకు కఠిన నియమాలతో సాధన చేయవలసి వుంటుంది. దాని కొరకు సన్యాసులు నియమనిష్ఠలతో దేశ, విదేశ సంచారం చేస్తూ వుంటారు. సూత్రాలు, గ్రంథాలు వుంటాయి. వీరి ప్రార్థన స్థలాలను ఆలయాలు అంటారు. ప్రవేశం దగ్గర టొరిగేట్ వుండదు. అందమైన పరిసరాలు వుంటాయి. బుద్ధుని పాదుకలు రాతితో లేక జూట్‌తో చేసినవి వుంటాయి. మూల విగ్రహం చిన్న రూపం నుండి జైంట్ బుద్ధ వరకు ఎన్నెన్నో వుంటాయి.

గర్భాలయ ప్రవేశానికి బయట ధుని వుంటుంది. దానితో సాంబ్రాణి వంటివి వేసి శరీరం పవిత్రం చేసుకుంటారు. బుద్ధుని విగ్రహం ఎదురుగా పెద్ద హుండీ వుంటుంది. దానిలోకి కాయిన్స్ విసిరివేసి, గంట కొట్టి బాగా వంగి లేచి మౌనంగా నమస్కరించి ప్రార్థన చేస్తారు. చప్పట్లు

కొట్టరు. బుద్ధ భగవానుడు ఎదురుగానే వున్నాడు కాబట్టి పిలువనవసరం లేదు. చనిపోయిన వ్యక్తుల కోసం బౌద్ధాలయంలో ప్రార్థనలు చేస్తారు. స్మశానాలు కూడా దగ్గరలో వుంటాయి. వారి ఆచారంలో సంవత్సరంలో ఒకసారి మరణించిన పెద్దలు ఇంటికి తిరిగి వస్తారు (మన మహాలయ అమావాస్య లాగ). బౌద్ధ మతం వచ్చిన కొత్తల్లో కొంత విరోధాలు ఏర్పడినా తరువాత సమన్వయం ఏర్పడింది. Mix of relegions కూడా ఏర్పడింది. Many Japanese take birth as Shinto and die as Buddist.

## ***మనసు పరవశించెనే*** - పెనుమాక నాగేశ్వరరావు

మనసు పరవశించెనే, తనువు పులకరించెనే
సద్గురుమూర్తి సన్నిధిలో నేను నిలచినంతటనే ॥మనసు॥

జయజయ ధ్వానములతో స్వామికి స్వాగతము పలుక
రాజసమొలకుచు రాజర్షులు రామమందిరమునకేతెంచగా
పుష్పంబులు బహుసొంపు సొంపుగా ఆసనంబు పై జల్లగా ॥మనసు॥

మందస్మిత వదనంబుతో మధురమూర్తి కనుపించగా
అస్మదాచార్యుల సంకీర్తనలే మహా ఆర్తిగ వినిపించగా
గురుపాద తీర్థమునే శిరముపై చల చల్లగ చల్లగ ॥మనసు॥

శిరము వంచి మనసు వుంచి వందనముల నర్పించగా
వేదమంత్రములు, మంత్రపుష్పములు ఏక స్వరమున పలుకుచుండగా॥

పూలదండలను చేతబుచ్చుకుని స్వామిచెంతకు చేరగా
రక్షపెట్టి అభయముద్రతో ఆశీస్సులందించగా
భక్తిభావము పొంగిపోయి మమ్ము మేమే మరచిపోవగా ॥మనసు॥


నామ మహిమ
ముకుంద్
పదండి, భోధల బాబా సంకీర్తనకి వెళ్దాము!
అమ్మో! పాము!
ఆ! చచ్చాను!


పాపం! దారిలోనే
చనిపోయాడు.
ప్రస్తుతానికి ఇక్కడ
ఉంచి మనం
భజనకెళ్ళాం.
3


శ్రీ రామ -
జయరామ - జయ
జయ రామ!
4


ఏమిటి నాయనా
అలా
పడుకున్నావు.
పద! భజన
చేద్దువు!
5
ఆ! నేను బ్రతికి
ఎలా ఉన్నాను?
6


మీ మహిమకు శిరసా ప్రణామాలు, బాబా!
ఇదంతా పరమాత్ముని నామం యొక్క మహిమే నాయనా!


చూశారా నామ మహిమ ఎటువంటిదో! త్రేతాయుగంలో రామ బాణం కంటే రామ నామమే గొప్పదని హనుమంతుడు నిరూపించాడు కదా! భగవన్నామం పాము విషాన్నే కాదు, భవరోగ విషాన్ని కూడా హరించగలదు.

# శ్రీ దాసశేష స్వామి

సేకరణ - మురళీ

(గత సంచిక తరువాయి)

1956వ సం.లో శ్రీ పెద్ద జీయరుస్వామి వారు ఆశ్రమాన్ని అభివృద్ధిపరచి శ్రీరామ పరివారాన్ని ప్రతిష్ఠించారు. అప్పటినుంచి "శ్రీ వాసుదాసాశ్రమం"గా పిలువసాగారు. 1972 వ.సం.లో శ్రీ పెద్ద జీయర్ స్వామి వారు సహస్ర కుండాలతో పన్నెండు యాగశాలల్లో తిరుమలలో శ్రీ లక్ష్మీనారాయణ మహాక్రతువు నిర్వహించారు. పన్నెండు యాగశాలల్లో పన్నెండు శ్రీ లక్ష్మీనారాయణ ధృవమూర్తులను పూజించి ఆ మూర్తులలో శక్తిని స్థాపించి దేశంలోని 12 వివిధ దేవస్థానాలలో ప్రతిష్ఠించారు. వాటిలో ఒక మూర్తిని నడిగడ్డలోని శ్రీ వాసుదాసాశ్రమంలో ప్రతిష్ఠించారు. ఇప్పుడు ఈ ఆశ్రమంలో శ్రీరామ పరివారంతోపాటు శ్రీ లక్ష్మీనారాయణ మూర్తులు నిత్య పూజలందుకుంటున్నారు. శ్రీ పెద్ద జీయరు స్వామివారు ఇక్కడ శ్రీరామ మహాక్రతువు నిర్వహించి స్థూపం ఆవిష్కరించారు. పెద్ద జీయ్యరుస్వామివారు నిర్వహించిన 108 స్వాధ్యాయన జ్ఞాన యజ్ఞములలో 28వ యజ్ఞము నడిగడ్డపాలెం లోనే నిర్వహించారు.

శ్రీ దాస శేష స్వాములు కేవలం గోమూత్రమే ఆహారంగా స్వీకరిస్తూ అష్టాక్షరీ మంత్రాన్ని కఠోర దీక్షతో ఉపాసించి మంత్ర సిద్ధులైనారు. అప్పటినుంచి సకల చరాచర ప్రపంచం శ్రీ రాధాకృష్ణ మయం అయ్యింది. అంతర్ముఖులై దేహదృష్టి లేకుండా ఉన్మత్తునివలె సంచరించేవారు. నిరంతరం హరేరామ హరేకృష్ణ మంత్రం తైలధారవలె జపిస్తుండేవారు. కలియుగంలో మోక్షసాధనకు హరినామ సంకీర్తనే సులభోపాయం కనుక శ్రీ దాసశేషస్వామి వారు శ్రీపాదుకా క్షేత్రములో "హరేరామ ....హరేకృష్ణ..." మంత్ర మహాయజ్ఞాన్ని ప్రారంభించారు. నిరంతరం హరినామ సంకీర్తన జరుగుతుండేది. సంకీర్తన చేసేవారికి, చూడవచ్చేవారికి సమారాధన కొరకు ఇల్లిల్లూ తిరిగి భిక్ష అర్థించేవారు. ఆ సమయంలో ఉత్తరభారతదేశం నుంచి ఝూసి ప్రతిష్ఠానపుర (ప్రయాగ) ఆశ్రమాధిపతులు శ్రీ ప్రభుదత్త బ్రహ్మచారి స్వామివారు శిష్యపరివారంతో విచ్చేసి, నామసంకీర్తన యజ్ఞంలో పాలుపంచుకుని, శ్రీ దాసశేషస్వామి వారి సేవలు కొనియాడారు. స్వామి శిష్యపరివారంతో

కాలినడకన భద్రాచలం శ్రీరాముని సన్నిధిలో, తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి సన్నిధిలో హరినామ సంకీర్తన చేసి వచ్చారు. శ్రీ సియా రఘువర దాసు (శ్రీ అవధూతేంద్ర సరస్వతీ స్వామి) గారు వేంచేసి శ్రీహరి నామ సంకీర్తన చేస్తూ తమ అమృతగానంతో భక్తులను ఆనంద పరవశు లను చేశారు.

సిద్ధపురుషులు శ్రీ సీతారామదాస్, ఓంకార్ నాథ్‌జీ మహరాజ్ వారి అహ్వానంపై దాసశేషస్వామి కొంతమంది శిష్యులతో గణపూర్ (కలకత్తాకు 80మైళ్ళ దూరం) లోని వారి ఆశ్రమానికి వెళ్ళి సత్సంగ మాధుర్యం అనుభవించారు. అనంతరం శ్రీ ప్రభుదత్త బ్రహ్మచారి గారి ఆహ్వానం మేరకు వారి ఆశ్రమన్ని సందర్శించి కొంతకాలం హరినామ సంకీర్తన చేసారు. ఉత్తరభారత దేశంలోని అనేక పుణ్యక్షేత్రాలు దర్శించి హరినామ సంకీర్తనతో పులకింపజేసి దాసకుటికి (అంగలకుదురు) తిరిగి వచ్చారు. దాసకుటిలో అవిచ్ఛన్నంగా సంకీర్తన జరిగే విధముగా ఏర్పాటు చేశారు. 1958వ సం.లో దాసకుటి వద్ద శ్రీరామ మహాసామ్రాజ్య పట్టాభిషేకోత్సవం జరిపించారు. చూడ వచ్చిన భక్తులందిరికీ అన్నదానం చేసి కార్యక్రమం ఎంతో వైభంగా నిర్వహించారు. భక్తి యోగంలో పండిన పండు శ్రీ దాసశేషస్వామి. దాసకుటిలో నిరంతరం హరినామ సంకీర్తన, విష్ణుసహస్రనామ పారాయణ చేస్తూ ది.29-11-1958న (కార్తీక బహుళ తదియ) శ్రీహరిపాదపద్మములలో ఐక్యమయ్యారు. ఓం తత్సత్.

## సమర్థ సద్గురు మాస పత్రిక సభ్యులకు విజ్ఞప్తి

ఈ క్రింద తెలిపిన సభ్యుల మాస పత్రిక చందా ఈ క్రింది మాసాలలో ముగుస్తుంది. పత్రిక నిలిపివేసే ముందుగా మీ సభ్యత్వాన్ని పునరుద్ధరించుకోనండి.

***ఆగస్ట్ 2024 :*** AS 7790, 7795, 8344, 8347, 8831, 9115, 9222 - 9225; LM 4456, 4457; PK 0028, 0029, 0031

***సెప్టెంబర్ 2024 :*** AS 5490, 8367 -8370, 8373-8375, 8385, 8386, 8834, 9226 -9242, 9244-9253 PK 0034, 0035

# నారద భక్తి సూత్రములు

(గత సంచిక తరువాయి)

- వారణాసి కాళీ ప్రసాద్ U.S.A

భక్తి సూత్రము 9: **తస్మిన్ అనన్యతా తద్విరోధిషు ఉదాసీనతా చ**

**తాత్పర్యము:** ఆ గురుదేవుని (భగవంతుని) పట్ల అనన్యత, ఆ అనన్యతకు విరోధమైన వాటి యందు ఉదాసీనత కలిగి వుండటము.



ఈ సూత్రం ద్వారా నారదులు న్యాసము యొక్క లక్షణాలను వివరిస్తున్నారు. అనన్యత అనగా అది తప్ప మరొకటి ఏదీ ఆధారము లేదన్న భావనను కలిగి ఉండడము. అలాగే ఉదాసీనత అంటే అనన్యతకు భంగము కలిగించే వాటి యందు ఉపేక్షను కలిగి ఉండటమే అని ఈ సూత్రం వివరిస్తోంది.

సదా తన గురుదేవుల పట్ల నిరతిశయమైన భక్తిని కలిగిన సాధకుడు జగత్తు సర్వమూ తన గురుదేవులచే నిండి వున్నదనే భావనను కలిగి వుంటాడు. దానినే అనన్యమని నిర్వచించారు. ఆ అనన్యత్వమును కలిగి ఉండడమే సాధకుడికి పరమావధి. వారికి గురుదేవులే పరమావలంబము.

ఆ అనన్యత్వమునకు విరుద్ధంగా వున్న ప్రతి భావన పట్ల సాధకుడు ఉదాసీనతను కలిగి వుంటాడు. ఉదాసీనత అంటే ఉపేక్ష అనే కాక తన గురుదేవుల విషయంలో తన భావనను విశదీకరిస్తూ అనవసరమైన వాదనలలో దిగకుండా వుండడమని కూడా సాధకుడు గ్రహించగలగాలి. దీని గురించి శ్రీ మాతాజీ వివరిస్తూ నిజమైన సాధకుడు జగత్తంతా తన గురుదేవులమయముగా చూడగలడనీ అదే జగద్గురు అన్నదానికి నిర్వచనమనీ సెలవిచ్చారు.

పై విధంగా నారదులు ఈ సూత్రం ద్వారా లోక వేద వ్యాపారములను ఎలా చేయాలో తెలుపుతున్నారు.

భక్తి సూత్రము 10. **అన్యాశ్రయాణాం త్యాగో అనన్యతా.**

**తాత్పర్యము** - (తన గురుదేవుని తప్ప) ఇతరములైన వారినీ లేక ఇతరములైన వాటినీ విడనాడుటయే అనన్య భావన అని పిలువ

బడుతుంది. నిజమైన సాధకుడు హృదయంలో తన ప్రియమైన గురుదేవులు తప్ప ఇతరములకు తావీయడు. అలాంటి వారికి అన్యమయినది ఏదీ ఉండదు. వారు ఈ చరాచర విశ్వమంతటినీ తన గురుదేవుల శరీరముగా భావిస్తారు. వారికి ఏదీ అన్యముగా కనిపించదు. ఇటువంటి భక్తి గోపికల విషయంలో మనకు కనిపిస్తుంది. వారు రాత్రీ పగలుతో సంబంధం లేకుండా ప్రతి క్షణమునూ ప్రతి అణువునూ శ్యామ మయముగా దర్శించారు.

ఇటువంటి భక్తులతో అన్య విషయములు ఏవైనా ప్రసంగించ బోయినా వాటిని ఆలకింపరు, ఆ ప్రసంగములు వారి చెవుల పడనే పడవు. ఎప్పుడైనా ఆలకించవలసిన తప్పని పరిస్థితి ఏర్పడినప్పటికినీ వారు అక్కడ నుంచి తప్పుకోవడానికి ప్రయత్నిస్తారు. ఇదే విషయాన్ని శ్రీ మాతాజీ ప్రస్తావిస్తూ అలాంటి అసందర్భ ప్రసంగం జరిగే చోట సాధకుడు ఉండరాదని, వీలైనంత త్వరగా తప్పించుకుని బయటపడాలని, అప్పుడు వారి సాధనలో పురోగతి కుంటుపడదనీ సెలవిచ్చారు.

పరమశివుని అనన్య ఉపాసకురాలైన పార్వతీదేవికి సప్తర్షులు ఆ మహాదేవునిలో వున్న లోపాలను వివరిస్తూ ఆయన నుండి మనసు మరల్చుకొని సకల గుణ సంపన్నుడైన మహావిష్ణువు మీద నిలపమని వివరించినప్పుడు ఆవిడ మహేశ్వరునిపై తనకున్న ప్రేమ బంధం ఎన్నో జన్మలదని తాను ఆయనను పొందలేక పోతే కన్యగానే మిగిలిపోవడానికి సిద్ధమని తెలియజేస్తుంది. చివరికి సాక్షాత్తు పరమేశ్వరుడే మారు రూపముతో ప్రత్యక్షమై తనను తాను దూషించుకున్నప్పటికీ పార్వతీదేవి ప్రేమలో మార్పు రాదు. నిష్కళంకమైన అనన్యభక్తికి ఇది గొప్ప నిదర్శనము. ఇటువంటి సాధకుని పరిస్థితినే ఈ సూత్రం ద్వారా నారదుల వారు వివరిస్తూ సాధకుడు గురుదేవులు తప్ప మరేదీ ఆశ్రయించడనీ ఆ అన్యాశ్రయములను త్యాగం చేయడమే అనన్యత అనీ వివరిస్తున్నారు.

- సశేషం

## ఆశ

- కుట్టీ. యన్.

భగవంతుడు మనుషులతో కలిసిమెలిసి సామరస్యంతో వుండమంటే, మానవుడు తనకు కావలిసిన విధంగా, ఆశ, కుళ్ళు, కుతంత్రాలతో నివశిస్తున్నాడు. మనిషిలో రకరకాల ఆశలు, ఆలోచనలు ఉద్భవిస్తూ వుంటాయి. ఉపకారం బదులు అపకారం చేయాలనే ఆలోచన, స్వార్థం ఉరకలేస్తూ వుంటాయి.

జ్ఞానాన్ని సంపాదించరా అని భగవంతుడు అంటే, మనిషి ఆశా నిరాశలతో ఆధ్యాత్మికంగా వెళ్ళలేకుండా వున్నాడు. ఎన్ని సుఖాలు, భోగభాగ్యాలు అనుభవించినా, ఇంకా ఏదో కావాలనే ఆశ. ఎంత తిన్నా ఇంకా ఏదో తినాలనే కోరిక. ఈ ఆశకు అంతేది? ఇంట్లో ఎన్ని సౌకర్యాలు వున్నా, ఇంకా ఏదో కావాలనే కోరిక. ఈ సుఖాలన్నీ మనకు భగవంతుడు ఇచ్చినవే. వీటిని సక్రమంగా ఉపయోగించటం లేదు మానవుడు. ఇదంతా తన ప్రజ్ఞ అనుకుంటాడు. భగవంతుడు ఒక ఝలక్ ఇస్తే మనం గిజగిజలాడి పోతాము. భగవంతుడు ఎంత ఐశ్వర్యం ఇచ్చినా ఇంకా ధనం కావాలనీ, కుబేరులు అయిపోవాలని ఆశచేత మోసాలు చేసి, పరులను పీడించి, తన వారసులకు సంపాదించి పెట్టాలనే ఆశ. ఎదుటివారు ఎలా పోయినా ఫరవాలేదు, తన బిడ్డలు మాత్రం బాగుపడాలి, విద్యాబుద్ధులు తన పిల్లలకే రావాలి అనే తపన. ప్రపంచంలో అందరికంటే తనే ధనవంతుడు అవ్వాలని ఆశ. ఉదయం లేచిన నుండి రాత్రి పడుకునే వరకు కోరికలే కోరికలు! ఇలా ఉన్నవాడు భగవంతుడిని ఎలా తెలుసుకుంటాడు?

భగవంతుడంటే భయం వుంటే కనుక ఇటువంటి ఆశలకు తావే లేదు. ధనాన్ని న్యాయంగా సంపాదించాలి. తనకు, తన వారికి ఖర్చుపెట్టి ఉన్నదానిలో ఇతరులకు సహాయం చేయాలి. కొంత భాగాన్ని దైవానికి సమర్పించాలి. అలా చేస్తేనే భగవంతుడికి ఇష్టం. అలా చేసినవారెప్పుడూ భగవంతుని దృష్టిలోనే ఉంటారు. అప్పుడు ఆశకు తావు ఉండదు.

మనిషికి కావలసినది నిస్వార్థం, భగవంతుని మీద భక్తి, విశ్వాసం, ధర్మబద్ధమైన జీవితం గడపటం. ఆశలు వెఱ్ఱితలలు వేయకూడదు. మనలోని షడ్గుణాలు పోవాలంటే ఆత్మను తెలుసుకోవాలి. ఈ దేహము అనేక ఇంద్రియాలతో కూడుకుని వున్నది. ఈ నాడులు, ఇంద్రియాలు ఆత్మ కావు. మనసు, బుద్ధి, చిత్తము, అహంకారము ఆత్మకాదు. ఆత్మ అతీతమైనది. అనంతము, శుద్ధము, నిత్యము అయిన ఆత్మకు నాశనము లేదు. ఈ ఆత్మ గుణాతీతము, కాలాతీతము. ఆత్మకు ఆకార వికారములు, నామ రూపాలు లేవు. కులమతాలు లేవు. ఆత్మ స్త్రీ కాదు, పురుషుడు కాదు, జంతువు కాదు, నపుంసకుడు కాదు. ఆత్మ నశించేది కాదు. ఆత్మ స్వయం ప్రకాశమమైనది.

# శ్రీ కాళీగార్డెన్స్ ఆశ్రమ కార్యక్రమాలు

**ఆగస్ట్ 2024**

2 శుక్ర: మాసశివరాత్రి

4 ఆది: అమావాస్య

7 బుధ: శ్రావణ శుద్ధ తదియ - సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ.

16 శుక్ర: వరలక్ష్మీ వ్రతం

17 శని : శనిత్రయోదశి

19 సోమ: శ్రావణ(రాఖీ) పూర్ణిమ - శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

26 సోమ: శ్రీ కృష్ణాష్టమి - కలశస్థాపన, శ్రీ రాధాకృష్ణ సహస్రనామార్చన, భక్త సమారాధన. రాత్రి 7.00 గం. లకు శ్రీ సద్గురు పాదపూజ.

27 మంగళ: శ్రీ కృష్ణాష్టమి - ఉ.11.00 గం.లకు సామూహిక శ్రీ రాధాకృష్ణ సహస్రనామార్చన, భక్త సమారాధన.

28 బుధ: శ్రీ గురుదశమి - ఏకాహం, సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ.

31 శని : శనిత్రయోదశి

**సెప్టెంబర్ 2024**

ఆది: మాసశివరాత్రి

2 సోమ: అమావాస్య

5 గురు: ఉపాధ్యాయ దినోత్సవం

7 శని : వినాయకచవితి - తె.జా.5.30 గం.లకు శ్రీ సద్గురు పాద పూజ. ఉ.11.00 గం.లకు సామూహిక వినాయకచవితి పూజలు, భక్త సమారాధన.

18 బుధ: భాద్రపద పూర్ణిమ, ఆశ్రమ ట్రస్ట్ హాస్పిటల్ వార్షికోత్సవం - శ్రీ సద్గురు పాదపూజ

27 శుక్ర: శ్రీ గురుదశమి - సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ.

30 సోమ: మాసశివరాత్రి

# మనశ్శతకము

(గత సంచిక తరువాయి)

పరశురామపంతుల లింగమూర్తి కవి

(తాత్పర్యము: కుమారి సన్నిధానం కాళీమాత)

**65. జ్ఞానజ్ఞేయ విలక్షణుడు, నానావిధ రూప కల్పనాతీతుం బ్ర**
**జ్ఞాన స్వరూపు ఘను సీతానాయకు బాయకెపుడు దలపవె మనసా.**

తాత్పర్యము: తెలుసుకునేవాడు, తెలుసుకోవడం, తెలియబడేది అనే త్రిపుటికి విలక్షణుడై అన్యవిధములైన రూపకల్పనలకు అతీతుడై ప్రజ్ఞాన స్వరూపుడు, ఘనుడు అగు సీతానాధుని వదలకు మనసా.

**66. పలుకుల నంటక చూపుల దలపుల నెడబాసి ప్రకృతి దాటి మనోబు**
**ద్ధులగడచి యంతయును దావెలిగించెడి రాము బొంది వెలయుము మనసా.**

తాత్పర్యము: వాక్కులకు అందక, దృశ్యాన్ని తలపులను వదలి ప్రకృతిని దాటి మనోబుద్ధులకు తెలియక వీటినన్నింటిని వెలిగించు శ్రీరాముని పొందవలెను మనసా.

**67. మఱపు లెఱుక చేయుచు దా నెఱిగిన వెయెఱింగి కొనుచు నెఱుక మఱపులన్**
**గుఱుతెఱుగుచు నేమిట దా బొరయని శ్రీరామచంద్రు బొందుము మనసా.**

తాత్పర్యము: మరచిన వాటిని తెలియజేస్తూ, తెలిసినవే మళ్ళీ మళ్ళీ తెలిసికొంటూ, మరచుట తెలియుటలకు కారణములను గుర్తెరిగి వీటన్నిటికీ అతీతుడయిన శ్రీరామచంద్రుని పొందుము మనసా.

**68. తెలివికి వేత్తై సకలము, తెలియుచు దను దెలిసినట్టి ధీరుల దనలో**
**గలుపు కొనుచు నేమిట దా గలియని భద్రాద్రి వాసు గనవే మనసా.**

తాత్పర్యము: జ్ఞానానికి అతీతుడై, సమస్తమూ తెలిసినవాడై, తనను తెలుసుకొన్న వారిని తనలో కలుపుకొంటూ, దేనిలోనూ తాను కలవని భద్రాద్రి వాసుని చూడుము మనసా!

- సశేషం

(గత సంచిక తరువాయి)

# నిరీక్షణ

తమిళ మూలం - శ్రీ ఆర్. సంపత్

తెలుగు అనువాదం - శశికళా దివాకర్

మాయ అయినప్పటికీ మోసపోయిన రాముడు లక్ష్మణుని రాకను చూసి, "తమ్ముడా! సీతనెందులకు ఒంటరిగ విడిచిపెట్టి వచ్చుచుంటివి?" యని ప్రశ్నించగ, లక్ష్మణుడు తాను పడిన ఆవేదనను ఆతనికి వివరించాడు. ఇరువురూ భయపడినట్లే వారికి తమ పర్ణశాల కానరాలేదు. సీతకూడ కనబడలేదు.

ఆవేదనాపూరిత హృదయులై, వారివురూ ముందుకు నడుచుకుంటూ ఆమెను వెదకుచుండ, వారికి విల్లంబులు, గద, శూలం, బంగారు కిరీటములు, వీణతీగ, చెల్లాచెదరై పడియున్న పక్షియొక్క రెక్కలు మున్నగునవి కనిపించాయి. వాటిని చూసిన కొద్దిసేపటికి వారికి ఒక మూలుగు శబ్దం వినిపించింది. అది జటాయు పక్షిదేయని వారు గ్రహించారు.

రక్తపు మడుగులో పడి, కొట్టుమిట్టాడుచున్న జటాయువు, "రామా! వచ్చేశావా!? నీ కొరకే నా ప్రాణములను అరచేతిలో పెట్టుకుని ఇలా ఎదురుచూస్తున్నాను. మీరు జానకిని ఎందుకు ఒంటరిగ వదలి వేసారు? రాక్షసుడైన లంకానగర రాజు ఆమెను కుటీరముతో సహా పెకలించి దక్షిణ దిశగ ఎగిరిపోయాడు. నాకు చేతనైనంత వరకు ఆతనిని అడ్డుకొన యత్నించాను. కానీ రావణుడు తన ఖడ్గముతో నా రెక్కలను నరికివేసాడు. ఇకపై మీరు ఆ భీకర అసురుని సంహరించి, మీ ఇంటి దీపమును తీసుకుని వచ్చే ప్రయత్నము చేయనారంభించండి" అని తెలియజేసి జటాయువు తన ప్రాణములను విడిచింది.

సీతను పోగొట్టుకొనుటయేగాక తండ్రివంటి జటాయువును కోల్పోయామన్న బాధ రాముని కలచివేసింది. ఆ పక్షికి మరణానంతర దహన సంస్కార కర్మలను చేశాడు. దశరథునికి లభించని భాగ్యము జటాయువుకు లభించింది.

మైథిలి అపహరింపబడిన వార్తను తెలుసుకున్న రామ, లక్ష్మణు లిరువురూ గోదావరి నది ప్రవాహ మార్గమందలి దక్షిణ దిక్కుకు తమ

పయనమును కొనసాగించి, సీతను వెదకుచూ నడవసాగారు. సీత ఎడబాటుతో కూడిన వ్యధను భరించలేక కన్నీరు కారుస్తూ రాముడు ముందుకు నడవసాగాడు. ఆ మార్గమున ఆతడు చూసిన దృశ్యములు ఆతనిని ఇంకాస్త రోదనకు గురిచేశాయి.

తన తీవ్ర ఆవేదన తీరుటకు ఒకే మార్గము 'జటాయువు తెలియజేసిన విధముగనే ఆ రాక్షసునియొక్క కులమునంతటినీ సమూలంగా నాశనమొనరించి సీతను తీసుకుని రావడమే' అని తనలో తాననుకొనుచు రాముడు ముందుకు నడువసాగాడు. తమ్ముడు లక్ష్మణుడు కూడ ఆతనిని అనుసరించాడు. అకస్మాత్తుగ ఆ మార్గమున తన కళ్లకు కడపడని ఒక రాక్షసుని చేతులలో వారిద్దరూ చిక్కి గిలగిలలాడారు. ఒకమారు తమ బలమంతటిని ప్రయోగించి, వాని నుండి విడివడి, ఆ రాక్షసుని కరములను నరకి విసరివేశారు.

"అయ్యో! బాధ తట్టుకోలేక పోతున్నానే" అని విలపించుచున్న ఆ అసురుని చూశారు. ఆతడు తల, కాళ్లు లేక ఒక్క ఉదరమును మాత్రమే కలిగియున్నాడు. ఆతడు ఉదరముపై ఒక కన్ను కలిగి చాలా భీకరముగ కనిపించాడు. ఎంత ప్రయత్నము చేసిననూ ఆతనిని సంహరించ వీలుకాలేదు రామలక్ష్మణులకు.

కాస్సేపటికి ఆ రాక్షసుడు తన ఏడుపునాపి, "వీరులారా! మీరెవ్వరు?" అని ప్రశ్నించాడు.

"నాపేరు రాముడు. ఈతడు నా తమ్ముడు లక్ష్మణుడు" అని బదులిచ్చిన రామునిగాంచి, ఆ అసురుడు, "నన్ను మన్నించి వదిలివేయండి. చేతులు నరకివేయబడిన నేను మీకు నమస్కారము జేయ వీలుకావడంలేదు. నిజమునకు నేను మీ కొరకే ఎదురుచూస్తూ ఉన్నాను" అని చెప్పి తన గత చరిత్రను వివరించ నారంభించాడు ఆ అసురుడు.

- సశేషం

# శ్రీ శంకర జయంతి

(గత సంచిక తరువాయి) - రమణ బాబు

ఆ మర్నాడు రాజుగారితో కవిగారు వేటకు వెళ్లినప్పుడు రాణీవారు మంత్రితో మంతనాలు చేసి రక్తసిక్తమైన బట్టలను తెప్పించి, "కవిగారు చనిపోయారు" అని మంత్రిగారితో చెప్పించింది. ఆ వార్త వినగానే పద్మావతీ దేవి అసువులు బాసింది. రాణిగారు కంగారు పడుతుంటే రాజు గారు కవిగారితో ప్రవేశించాడు. ఈ కోలాహలంలో పద్మావతీ దేవి మరణం కలకలం సృష్టించింది. "ఏమైంది?" అని రాజుగారు నిలదీశారు. రాణికి నిజం చెప్పక తప్పలేదు. రాణీగారిని చంపటానికి ఉద్యుక్తుడైన రాజుని జయదేవుడు వారించి, "రాజా! ఇది మంచి సంస్కారం అనిపిస్తుందా? పోయినవారు తిరిగి వస్తారా?" అని సంజీవని అష్టపదిని జయదేవుడు ఆలాపిస్తే పద్మావతీ దేవి పునర్జీవితురాలైంది. అందుకే దీనికి "సంజీవని అష్టపది" అని పేరు వచ్చింది. ఇక్కడ ఉన్నది ద్వైతం కాదు. అద్వైతమే. రాధాకృష్ణులు వేరు కాదు. వారు ఒక్కరే. వారి ప్రేమ ఎంతని వర్ణించగలం? అక్కడ ఇంద్రియాలు, విషయం, ప్రపంచం ఉన్నదా?

అలా ఎన్నెన్నో శ్రీ గురుదేవులు మనకు తెలియజేశారు. భక్త విజయం చదవండి. దానిని ఆకళింపు చేసికొని మీ సొంత మాటలలో వ్రాసి మ్యాగజైన్‌కి ఇవ్వండి. పాయింట్లు అన్నీ రావాలి" అని శ్రీగురుదేవులు చెప్పి ఉన్నారు.

భక్తులు మనకి ఉన్న కష్టనష్టాలు వాళ్ళూ అనుభవించారు. కాని భగవంతుని మరువలేదు. వాళ్ళేమీ కోటీశ్వరులు కారు వారు యాచన చేసి, ఆప్యాయతతో భక్తులకు వండి వడ్డించేవారు. ఆ భక్తుల కష్టాన్ని, నీ కష్టంగా అనుభవించు. నీ జీవితం సాధనకు వుపయోగపడుతుంది. శివుడు మారువేషంలో వచ్చి, "నాకు ఆకలి" అంటే భర్త తన భాగాన్ని ఇస్తాడు. "ఇంకా ఆకలి" అంటే భార్య, పిల్లలు తమ భాగాన్ని ఇస్తారు. ఇచ్చిన తరువాత వారిలో సందేహాలు ఏవీ మిగలలేదు. "సాక్షాత్తు పరమాత్మ స్వీకరిస్తున్నాడు" అని భావించారు. వాళ్ళ కడుపులూ నిండాయి. భగవంతునియందు పరిపూర్ణమైన భక్తి, తృప్తి భగవన్నామం లోనే ఉంది. భక్తవిజయం చదవగా, చదవగా ఇంకా లోపలికి వెళ్ళి పోవాలి. మీరు చదివి మీ మాటలతో వ్రాసిన దానితో గురుదేవులతో

మీరు పొందిన అనుభూతులు మేళవించండి. అలా శ్రీ గురుదేవులు బ్రహ్మజ్ఞానాన్ని మనకు పొల్లు పోకుండా అందించారు. మనం కూడా మన జీవితంలో సాధనాపరంగా ఎదగాలి. మనస్సు జ్ఞానం వైపు తిరిగితే శ్రీ గురుదేవుల సర్వ వ్యాపకత్వాన్ని మనం అనుభవించగలుగుతాం. ఈ రోజు శ్రీ గురుదేవులు బృందావనంలో ప్రతిష్ఠితులై 30 సంవత్సరాలు గడిచాయి. ఎప్పుడు కావాలంటే అప్పుడు మనకి దర్శనం ఇస్తూ మనలను అనుగ్రహిస్తూనే ఉన్నారు. కాబట్టి శ్రీ గురుదేవులు మనందరికీ అట్టి భక్తిని, శక్తినీ ప్రసాదించుగాక! అటువంటి శ్రద్ధా విశ్వాసాలు మనం పెంపొందించుకొని మన జీవితాలను తరింప చేసికొందుము గాక! సుఖీభవ!

## శ్రద్ధాంజలి

శ్రీబాబు చిరకాల భక్తులు, ఆశ్రమనివాసులు శ్రీ పోతరాజు వెంకట రామశర్మ గారు 12-7-2024 శుక్రవారం నాడు శ్రీసద్గురు సాయుజ్యం పొందారు. వీరి వయస్సు 75 సంవత్సరాలు. సద్గురుదేవులు వీరి ఆత్మకు శాంతిని ప్రసాదించెదరు గాక! వీరి కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియ జేస్తున్నాము.

## పెదనింద్రకొలను శాఖలో కార్యక్రమాలు

** ప్రతి గురువారము అన్నార్తులకు, సాధువులకు అన్నదానం జరుగును**

**ఆగస్ట్ 2024**

19 సోమ: శ్రావణ పూర్ణిమ - శ్రీ సద్గురు పాదపూజ.

26 సోమ: శ్రీ కృష్ణాష్టమి - శ్రీ సద్గురు పాదపూజ.

28 బుధ: శ్రీ గురుదశమి - శ్రీ సద్గురు పాదపూజ.

**సెప్టెంబర్ 2024**

19 సోమ: శ్రావణ పూర్ణిమ - శ్రీ సద్గురు పాదపూజ.

26 సోమ: శ్రీ కృష్ణాష్టమి - శ్రీ సద్గురు పాదపూజ.

28 బుధ: శ్రీ గురుదశమి - శ్రీ సద్గురు పాదపూజ.

# శ్రీరాధాకృష్ణా గతిర్మమ

- ఆహ్లాదినీ రాధ

నా పేరు ఆహ్లాదినీ రాధ. శ్రీరాధాకృష్ణులు నాకు ప్రియమైన ఇష్ట దైవములు. నేను కృష్ణుని అనుగ్రహం చేత బృందావనంలో పుట్టాను. నాకు చిన్నతనంలోనే కృష్ణునితో వివాహమైంది. అది ఒక మధురమైన అనుభవము.

5000 సంవత్సరాల క్రితం కృష్ణుడు 2 సంవత్సరాల ప్రాయంలో ఉన్నప్పుడు నందుడు అతనిని ఎత్తుకొని భాండీరవనానికి ఆవుల మందతో వచ్చాడు. అప్పుడు ఒక పెద్ద గాలివాన వస్తే కృష్ణుడు ఏడవటం మొదలు పెట్టాడు. అప్పుడు రాధ అక్కడికి వచ్చింది. నందుడు కృష్ణుడిని ఆమెకిచ్చి యశోదకు ఇచ్చి రమ్మన్నాడు.

కాని రాధ అతనిని యమున వద్దకు తీసికొని వెళ్ళింది. అప్పుడు కృష్ణుడు 16 సంవత్సరాలవాడైనాడు. బ్రహ్మదేవుడు అతనికి రాధతో వివాహం జరిపించి అంతర్థానమైనాడు. రాధా కృష్ణులు అక్కడ రాస లీలలు చేశారు. మర్నాటికి కృష్ణుడు 2 సంవత్సరాల బాలుడిగా మారాడు. అప్పుడు రాధ అతనిని యశోదకు అప్పగించింది. కృష్ణుడు రాత్రి అయ్యే సరికి తిరిగి 16 సంవత్సరాల వాడయ్యేవాడు. రాధా కృష్ణులు బృందావనంలో రాసలీలలు చేసేవారు.

ఆ కాలం నుంచే బ్రాహ్మణులు అక్కడ నివసించేవారు. నేను కృష్ణుడి విగ్రహం తీసికొని అక్కడకు వెళ్ళాను. అక్కడ ఉన్న బ్రాహ్మణులు నన్ను కృష్ణుని ప్రక్కన కూర్చోబెట్టి అతనితో నాకు వివాహం జరిపించారు. అది మరపురాని దివ్యానుభవం. రాధ ఎంతో దయామయి, కరుణామయి. నాకు ఎంతో సహాయం చేసింది. నాకేకాదు ఎవరికి ఏ ఏ అవసరం. వచ్చినా సహాయం చేసేది.

శ్రీకృష్ణుడు సచ్చిదానంద స్వరూపుడు. దానికి మించిన ఆనందం ఎక్కడా దొరకదు. భగవద్గీతలో

**మన్మనాభవ మద్భక్తో మద్యాజీమాం నమస్కురు।**

**మామేవైష్యసి సత్యంతే ప్రతి జానే ప్రియోసి మే॥** 65/18

"నా యందు మనస్సునుంచుము. నా యెడల భక్తి కలిగి యుండుము. నాకు నమస్కరింపుము. అట్లు కావించిన నీవు నన్నే పొందగలవు. నీవు నాకు ఇష్టుడవై ఉన్నావు. కావున యదార్థముగా ప్రతిజ్ఞ చేసి

చెప్పుచున్నాను." అందువలన మనం భగవద్గీతాధ్యయనం చేయాలి. ప్రాపంచిక విషయాలను ప్రక్కన పెట్టి సమర్థుడైన సద్గురువు వద్ద శిక్షణ పొందాలి. అందరియెడల దయకలిగి ఉండాలి. ఏ రూపంలోనైనా కృష్ణుడు రావచ్చును. అహంకార మమకారములను అదుపులో వుంచుకోవాలి. కృష్ణుడు సర్వవ్యాపకుడు. అజ్ఞానులు అతనిని తెలుసుకొన జాలరు. ప్రపంచ విషయాదులు అనిత్యములు.

ఆత్మను గురించి మాండూక్యోపనిషత్తులో ఏమి చెప్తోందో తెలిసుకొందాం: **"నాంతః ప్రజ్ఞం న బహిఃప్రజ్ఞం నో భయత ప్రజ్ఞం న ప్రజ్ఞానఘనం న ప్రజ్ఞం నా ప్రజ్ఞం । అదృష్టమవ్యవహార్యమగ్రాహ్య మలక్షణ మచింత్య మవ్యపదేశ్య మేకాత్మ ప్రత్యయసారం, ప్రపంచోపశమం శాంతం శివమద్వైతం చతుర్థం మన్యంతే స ఆత్మా స విజ్ఞేయః** (7వ మంత్రం మాండూక్యోపనిషత్తు.)

"ఆ ఆత్మ లోపల తెలియదు, బయట తెలియదు, లోపలా బయటా తెలియదు, తెలియనిది కాదు. అది అదృష్టం, అవ్యవహార్యం, అగ్రాహ్యం, అలక్షణం, అచింత్యం, చెప్పలేనిది, ఏకాత్మ ప్రత్యయసారం, ప్రపంచోపశమం, శాంతం, శివం అద్వైతం, నాల్గవదిగా చెప్పబడినది, అదే ఆత్మ. అదే తెలుసుకోవలసినది."

రాధాకృష్ణుల నామాన్ని, తలుస్తూ, అంటూ, వింటూ మనం ఆ రూపాన్ని పొందుతాము. **"రాధా గతి లభేత్ ధృవమ్"**. మనమందరము మన బంధువులతో రత్న విమానం ఎక్కి గోలోకం చేరుతాం. గోలోకంలో మరణంనుండి ముక్తులమై ముక్త సాగరంలో, బ్రహ్మ చైతన్య సారంలో, ద్వైత రహిత ప్రేమ సాగరంలో ఉండిపోతాం. **"ఏకమ్ జ్యోతిర్భూ ద్వివిధ మాధవ రూపకమ్"**. అక్కడ రెండు లేవు. ఉన్నది ఒకటే. బృందావనంలో ఒక భక్తునికి రాధామాధవులు ఏకరూపంగా దర్శనం ఇచ్చారు. నందుని ఇంటి వద్ద ఆ మూర్తికి ఒక ఆలయం కూడా నిర్మించబడింది.

రాధాకృష్ణుల రాసలీలలు నిరంతరం బృందావనంలో జరుగుతూనే ఉంటాయి. అక్కడికి వెళ్ళినవారు అశ్వర్థవృక్షం వద్ద ఈ రాసలీలల అనుభవాన్ని ఇప్పటికీ పొందుతూనే ఉన్నారు. **"అద్వయీ తత్త్వమయీ రాధా"** రాధాకృష్ణులు ఒకరే, వేరు కాదు. రాధ ఎప్పుడూ కృష్ణుడినే తలుస్తూ ఉంటుంది. కృష్ణుడే నా దైవం. నేను వేరే మానవుని వివాహం చేసికోను. నాకు ఆయనతో చిన్నప్పుడే వివాహం అయిపోయింది. నేను భాండీర వనంలో కృష్ణునితో ఆనందంగా వుండిపోతాను.

# సమర్థ సద్గురునాథుని దివ్య చరిత్ర

## శ్రీబుల్లిమామయ్య తెలిపిన శ్రీబాబు లీలలు

(గత సంచిక తరువాయి) - కీ.శే. విజయేశ్వరానంద ప్రసాద్

నిర్ఘాంతపోయిన ఆ పెద్ద మనిషి కుర్చీలో నుంచి లేచి శ్రీ బాబు పాదాలకు సాష్టాంగ నమస్కారం చేసి, "నా అహంకారానికి, అల్పజ్ఞతకు మన్నించండి. ఎటూ తేలని నా రిసెర్చికి తమరొక మార్గం చూపించారు" అన్నాడు. శ్రీ బాబు అబ్బే! నాకేమీ తెలియదండి. నా పొట్ట కోసినా అక్షరం ముక్క లేదు. మీరు చేస్తున్న రిసెర్చి వలన లోకానికి మహోపకారం జరుగవలసి ఉన్నందున, జగన్మాత ఎంతో దయతో మీకు యీ



సూచనలను అందించి వుంటుంది లెండి. అదంతా అమ్మ కృప" అన్నారు.

5. యనమదుర్రులో పండుదొరగారి అన్నగారైన గోపాలంగారు శ్రీబాబును చాలా కాలం పాటు వ్యతిరేకించేవారు. "దేవుడూ లేడు, దయ్యమూ లేదు. ఇదంతా వట్టి హంబక్ (బూటకం)" అనేవారు. శ్రీ బాబు యనమదుర్రులో ఉన్నపుడు ఒకసారి గోపాలంగారు వారితోనే అలా అనేసరికి , శ్రీ బాబు "నీకిప్పుడు జాతకరీత్యా మంచి మహర్దశ నడుస్తున్నది. అందువలన సాక్షాత్తు భగవంతుడే దిగివచ్చి చెప్పినా నీ చెవికెక్కదు. కాని 25 సంవత్సరాల తరువాత, నీవే ఒకనాడు నన్ను వెదుక్కుంటూ నా దగ్గరకు వచ్చి "దేవుడూ, దయ్యమూ" వున్నది లేనిదీ నాతో చెబుతావు. అంతవరకు నేను నీ చుట్టు ప్రక్కలనే వున్నా, నువ్వు నన్ను గుర్తించలేవు. సత్యాన్ని గ్రహించలేవు" అన్నారు.

ఆశ్రమ స్థాపనానంతరం సుమారు 1975లో, నవరాత్రి మహోత్సవాలలో ఒకరోజున శ్రీ బాబు అనుగ్రహ భాషణం చేస్తూ "యనమదుర్రులో ఒక పెద్ద మనిషి నాతో 'దేవుడూ లేడు, దయ్యమూ

లేదు' అని వాదించాడు. 'ఉన్నాయో లేవో 25 సంవత్సరాల తరువాత నువ్వే నన్ను వెదుక్కుంటూ వచ్చి చెబుతావులె'మ్మని అప్పుడు నేను ఆయనతో అన్నాను. ఆ పెద్ద మనిషి యిప్పుడు యిక్కడే యీ సభలోనే ఉన్నాడు. కాస్త లేచి నుంచుని అదేదో చెబితే అందరూ వింటారు'' అన్నారు శ్రీ బాబు.

ఆయన లేవలేదు. "వారేనండి. యెడమ వైపు చివరి స్తంభాన్ని ఆనుకుని, మనవణ్ణి ఒళ్ళో పెట్టుకుని కూర్చున్నారే, వారే! ఆ బట్టతల వారే'' అనేసరికి అందరూ అటువైపు చూశారు. అయినా ఆయన లేవలేదు. శ్రీ బాబు మళ్ళీ "పేరు గోపాలంగారు. కాస్త సిగ్గు పడుతున్నారు లెండి'' అన్నారు.

గోపాలంగారు నిలబడ్డారు. శ్రీ బాబు "ఏమంటారు గోపాలంగారూ? దేవుడూ, దయ్యమూ ఉన్నాయంటారా లేవంటారా?'' అన్నారు. గోపాలంగారు నమస్కారం చేసి, "ఉన్నాయండి'' అన్నారు. శ్రీ బాబు "పాపం! ఇప్పుడు ఒప్పుకోకుండా ఎలా ఉండగలరు? స్వానుభవం కదా! మొదటి భార్య చనిపోయి, రెండవ భార్యను దయ్యమై పట్టుకుంది. ఇనప్పెట్టె తాళం వేసి ఉండగానే లోపలి డబ్బును మాయం చేసేస్తోంది. అంతకంటె శిక్ష ఇంకేం కావాలి? ఇన్నాళ్ళూ నేను మీ చుట్టు ప్రక్కల్నే భీమవరం, నిండ్రకొలను, ఏలూరు, నరసాపురం అన్ని ఊళ్ళలో తిరుగుతున్నా, నా దగ్గరకు రాగలిగారా? దయ్యం కనిపించిన తరువాత, యిప్పుడు మా ఆహ్వాన పత్రికలో మా జగన్మాత దివ్యమూర్తిని చూశాక, దేవుడున్నాడని, వాడి దయ కావాలని నా దగ్గరకు వచ్చారు. పోనీ లెండి. ఎలా వచ్చినా, తన బిడ్డ తన దగ్గరకు చేరుకున్నాడనే సంతోషం జగన్మాతకు ఎప్పుడూ వుంటుంది. ఆమె కృప సదా మీపై వర్షిస్తుంది'' అని ఆశీర్వదించారు. గోపాలంగారి భార్య గ్రహబాధ తొలగిపోయింది. గోపాలంగారు కూడ శ్రీ బాబు భక్తులైనారు.

- సశేషం

విష్ణు  కథలు

(గత సంచిక తరువాయి)

-రమణ ప్రసాద్

# చైతన్య మహాప్రభువు

చైతన్యుడు నవద్వీపము చేరి తన శిష్యులతో "ఒక మహాత్ముడు ఇక్కడకు వచ్చి ఉన్నాడు, అతనిని తన వద్దకు తీసుకు రమ్మని చెబుతాడు. శిష్యులు అన్ని వైపులకు వెళ్ళి అన్వేషిస్తారు. అతని జాడ తెలియలేదు. అప్పుడు చైతన్యుడు ఒక భక్తుని ఇంటికి శిష్యులతో వెళితే అక్కడ విశ్రాంతి తీసుకుంటున్న నిత్యానందుని చూశాడు. చిన్ననాటినుండి కృష్ణ భక్తితో ఓలలాడే నిత్యానందుడు చైతన్యుని చూసి శ్రీకృష్ణసందర్శన భాగ్యం లభించినంత ఆనంద పడ్డాడు. నిత్యానందుని పూర్వాశ్రమ నామం "నితాయ్". "నితాయ్", "నిమాయ్"లు బలరామ కృష్ణులవలె భాసించారు. చైతన్యులు "ఇతడు నా జ్యేష్ఠ సోదరుడు" అని తల్లికి పరిచయం చేశాడు. శచీదేవి నిత్యానందునిలో తన పెద్దకుమారుడైన విశ్వరూపుడే ఈ రూపంలో వచ్చాడని సంతోషించింది.



చైతన్యుని శిష్యకోటిలో నిత్యానందుడు అగ్రగణ్యుడు. పదిమందికి భక్తిని పంచటమే తన కర్తవ్యంగా భావించాడు నిత్యానందుడు. ఒకనాడు భక్తులతో కలసి సంకీర్తన చేస్తున్నాడు నిత్యానందుడు. ఆ ఊరిలో జగన్నాధ, మాధవులనే ఇద్దరు హంతకులు ఉన్నారు. వారిని 'జాగాయి', 'మాదాయి' అంటారు. వారు క్రూర స్వభావం కలవారు. దోపిడీలు, దొంగతనాలు చేసి జీవించేవారు. నిత్యానందుల వారు సంకీర్తన చేస్తుంటే జాగాయి, మాదాయిలు తప్పత్రాగి వచ్చి వారిని అడ్డగించారు. నిత్యానందుని పైకి మధు పాత్రను విసిరారు. నిత్యానందుని తలకు పెద్ద గాయమయింది. రక్తం ధారగా ప్రవహించింది. నిత్యానందులు

వారితో "నాయనా! నన్ను కొడితే మీ కోపం పోయిందా? నా రక్త ధారలు మీకు ఆనందాన్ని కలిగించాయా? అలా అయితే నా శరీరంలోని రక్తాన్ని చిందిస్తాను, కాని ఒక్కసారి "కృష్ణా " అని అనలేరా?" అంటూ కృష్ణ నామం చెబుతూ నృత్యం చేశాడు. నిత్యానందుడు గాయ పడిన సంగతి చైతన్యులకు తెలిసి, ఆయన వచ్చి నిత్యానందుని తలనుండి కారుతున్న రక్తాన్ని తుడిచి, జాగాయి మాదాయిలను ఉద్దేశించి "మా భక్తులను గాయపరచటమే మీ ఉద్దేశ్యమైతే మా నితాయ్‌నే ఎందుకు గాయపరిచారు నన్నూ గాయపరచి ఉండాల్సింది" అని పలికి నిత్యానందుని తీసుకుని ఇంటికి వెళ్ళాడు.

నిత్యానందుని మంచి మాటలు, చైతన్యుని ప్రేమ పూరితమైన సంభాషణలు జాగాయి, మాదాయిలను కదిలించి వేశాయి. ఆ మర్నాడు వారు చైతన్యులను సమీపించి క్షమాభిక్ష కోరారు. చైతన్యులవారు వారిని ఆశీర్వదించారు. నిత్యానందుని క్షమించమని ఆయన పాదాలపై పడ్డారు. "నాయనలారా! మీరు నా బిడ్డలు. బిడ్డలు తప్పు చేస్తే తల్లిదండ్రులు వారిని దూరం చేసుకుంటారా? అన్నారు. వారు చైతన్యులవారి భక్తి ఉద్యమంలో కలిసి పోయారు.

చైతన్యులు కృష్ణతత్వం ప్రచారం చెయ్యటం మొదలు పెట్టారు. తన శిష్యులను ఒక్కచోట చేర్చి, తాను సంకీర్తన చేస్తూ, నృత్యం చేస్తూ ఆనంద పారవశ్యంలో తేలియాడుతూ తనను ఆశ్రయించిన భక్తులను కూడా ఆ స్థాయికి చేర్చేవారు. నామామృతాన్ని గ్రోలుతూ ఒక్కొక్కసారి మూర్ఛపోయేవాడు. మూర్ఛ నుండి తేరుకుని, "శ్రీకృష్ణా నీవు లేని ప్రతి క్షణం నాకొక యుగమైంది. నీ దర్శనభాగ్యం నాకు కలిగించు కృష్ణా!" అని విలపించేవాడు.

- సశేషం

**ఏది గురుకృప ?**

కష్టనష్టములోనపడి తలమునకలవుతున్న మానవుని మదిలోని శంక తీర్చునదియే శ్రీ గురు కృప! "నా వల్ల కాదు" అని నీవు నీరసించిన వేళ "నేనుండ భయమేల" అని నీకు ఆధారమైనదియే శ్రీ గురు కృప! "నీవు వదలిన నేమి? నిన్ను వదలను"అని నీవెంట నడిచేది శ్రీ గురుకృప ! కైవల్యమును కోరి, కాలము జమ చేయుమని నిను జాగృతము చేయునది శ్రీ కాళీప్రసాద సద్గురు కృప!

*- భాగవతుల హనుమత్ జయప్రద*

# శ్రీ కాళీ వనాశ్రమ శాఖ, భీమవరము, పశ్చిమ గోదావరి జిల్లా (ఆం.ప్ర)

### భవన నిర్మాణము

సమర్థ సద్గురుదేవులు శ్రీ హనుమత్కాళీ వర ప్రసాద బాబూజీ మహరాజ్ వారు లోక కళ్యాణం కొరకై ఎన్నో చోట్లకు వెళ్ళి ఎందరో భక్తుల ఆర్తిని బాపిన అవతార పురుషులు. వారు నడయాడిన ఊరు భీమవరము మరియు ఆ చుట్టు ప్రక్కలనున్న యనమదుర్రు, దిరుసుమర్రు మొదలగు గ్రామములు. శ్రీ స్వామివారు మహా ప్రస్థానం పొంది 35 సంవత్సరములు అయినవి. ఇచ్చటి భక్తులందరూ చేరి భీమవరం-ఉండి రోడ్డున దాతలు ఇచ్చిన స్థలములో బృందావనము, దాని ప్రక్కన అన్నదాన శాల, వసతి గృహము నిర్మింప సంకల్పించినారు. ఈ భవన శంకుస్థాపన శ్రీ కాళీవనాశ్రమ పీఠాధిపతి యోగిని శ్రీచంద్ర కాళీ ప్రసాద మాతాజీవారు, ది.10-05-2023 తెల్లవారు జామున 3.24 గం.లకు చేశారు.



ఈ సందర్భమున భక్తులకు చేయు విన్నపమేమనగా, మీరెల్లరూ ఎంతో ఉదారస్వభావముతో ముందుకు వచ్చి త్వరలో ఈ భవన నిర్మాణము పూర్తియగు నట్లు తమ సహాయ సహకారములను ధన రూపేణ, వస్తు రూపేణ అందించమని ప్రార్థించుచున్నాము.

విరాళములు ఈ క్రింది బ్యాంక్‌కు పంపవలెను.
Sri Sri Sri Hanumat Kali Vara Prasad Babu Trust
Bank of Baroda, Nambur Branch
S/B Account No : 69900 1000 00 172
IFSC : BARB0DBUNAM (5th character is 'zero')
Contact Numbers
Murali : 93983 34345
Tummalapalli Siva : 96181 99556

**భక్తులు ఒసగు విరాళములకు ఐ.టి యాక్ట్ 80జి క్రింద పన్ను రాయితీ లభించును.**

---

Printed, and Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - PALURI SIVA RAMA KALI PRASAD

## 26.05.2024 నుండి 10.06.2024 వరకు
## శ్రీ మాతాజీవారి యునైటెడ్ కింగ్‌డమ్ పర్యటన దృశ్యములు.







REGD. NEWS MAGAZINE PERIODICAL
Posted on Fifth and Sixth of every month

RNI No. 37804/81
POSTAL REGD. No. : GTR/27/2024-26

## 26.05.2024 నుండి 10.06.2024 వరకు
## శ్రీ మాతాజీవారి యునైటెడ్ కింగ్‌డమ్ పర్యటన దృశ్యములు.





If undelivered please return to
SAMARDHA SADGURU
Sri Kali Gardens Ashramam - 522 508, A.P.